
వార్త
14 జనవరి 2024
ఆదివారం
సంక్రాంతి సోయగం
"Anand"



# సిద్ధూ జొన్నలగడ్డ జోడీగా వైష్ణవిచైతన్య!

'బేబి' సినిమాతో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చిన వైష్ణవి చైతన్య ఆ సినిమా సక్సెస్‌తో యూత్‌లో మంచి క్రేజ్‌ను సంపాదించుకుంది. ఆ తరువాత ఆమె ఆనంద్ దేవరకొండ జోడీగా మరో సినిమాను అంగీకరించింది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగు దశలో ఉంది. ఇప్పుడు ఆశిష్ సరసన ఛాన్స్ కొట్టేసింది అమ్మడు. దిల్ రాజు బ్యానర్‌లో ఈ సినిమా రూపొందుతోంది. ఈ నేపథ్యంలో సిద్ధూ జొన్నలగడ్డ జోడీగా ఆమె మరో సినిమాలో చోటు దక్కించుకుంది.

శ్రీవేంకటేశ్వర సినీ చిత్ర బ్యానర్‌లో సిద్ధూ జొన్నలగడ్డ హీరోగా 'బొమ్మరిల్లు భాస్కర్' ఒక సినిమా చేస్తున్నాడు. ఈ సినిమాలో కథానాయికగా వైష్ణవి చైతన్యను ఎంపిక చేశారు.

## తారాతీరం

# గోపీచంద్ సినిమాలో జయరామ్?

యాక్షన్ హీరో గోపీచంద్ హీరోగా దర్శకుడు శ్రీను వైట్ల దర్శకత్వంలో ఓ సినిమా రాబోతున్న సంగతి తెలిసిందే! తాజా సమాచారం ప్రకారం ఈ సినిమా షూటింగ్‌లో మలయాళ నటుడు జయరామ్ కూడా పాల్గొనబోతున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో జయరామ్ పాత్ర చాలా కీలకమని తెలుస్తోంది. ఈ చిత్రంలో దర్శకుడు శ్రీను వైట్ల ఫుల్ ఎంటర్టైన్‌మెంట్‌ను ప్లాన్ చేస్తున్నాడని టాక్. ఈ చిత్రంలో ఓ ప్రత్యేకమైన పాట ఉన్నట్లు సమాచారం. ఈ సినిమాని చిత్రాలయం స్టూడియోస్ సంస్థపై ప్రొడక్షన్ నెంబర్ వన్‌గా వేణు దోనేపూడి ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్నారు. ఈ చిత్రానికి 'విశ్వం' అనే టైటిల్‌ని యూనిట్ పరిశీలిస్తున్నట్లు వినికిడి.



ఆదివారం వార్త

14 జనవరి, 2024

## మంచి ముత్యాలు

పగ సాధింపు చర్యలు ఆపితే నిన్నటి శత్రువులు రేపటి స్నేహితులు కాగలరు.

- గాంధీజీ

## విషయ విశేషం

లిప్ ప్లాంట్స్... 4

'సంఘీ'భావం....5

అందనంత ఎత్తులో సన్నాలు బియ్యం

కవర్ స్టోరీ..6

సంక్రాంతి సోయగం

కృత్రిమ మేధ ఆవశ్యకత...11

ఈవారం కవిత్వం..12

పచ్చనోటు పరపతి

మనం మారుదాం!...14

కల్తీలతో రోగాలు!....18

కథ.. 20

సారీ..టైం లేదు

సాహిత్యం..23

'కవికోకిల' దువ్వూరు రామిరెడ్డి

అవతార్ చిత్రానికి స్ఫూర్తి 'టియాంజీ'..25

ఆరోగ్య సమస్యలు తీరేదెలా?...29

ఇంకా..

పుస్తక సమీక్ష

మొగ్గ

వారఫలం

వగైరా..వగైరా..

## తాజా వార్తలు

### గుండెకు శాకాహారం మేలు



ఇటీవల చాలామంది జంతు ఉత్పత్తుల్ని తగ్గించి పూర్తిగా శాకాహార ఉత్పత్తులతో తయారైన వీగన్ డైట్ తీసుకుంటున్నారు. అయితే అది ఏమేరకు ఆరోగ్యం మీద ప్రభావాన్ని కనబరుస్తుందో కచ్చితంగా తెలుసుకునేందుకు స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీకి చెందిన నిపుణులు కవలల్లో అధ్యయనం చేశారు. ఏకరూప కవలలు దాదాపు ఒకేవిధమైన ఆరోగ్యంతో ఉంటారు. జన్యు నిర్మాణంతోపాటు జీవనశైలి కూడా ఒకేవిధంగా ఉంటుంది. కాబట్టి ఏది మంచిది అన్నది తెలుసుకునేందుకు కవలలే సరైన ఎంపిక అనుకున్నారు. అందులో భాగంగా ఎలాంటి హృద్రోగ సమస్యలూ లేని 22 కవల జోడీల్ని ఎంపికచేసి వారిలో ఒకరికి ఎప్పట్లా మాంసాహారం, శాకాహారం రెండు రకాల్నీ, మరొకరికి పూర్తిగా శాకాహార సంబంధిత ఆహారాన్నీ రెండు నెలలపాటు ఇచ్చారట. అయితే రెండు రకాలూ తినేవాళ్లతో పోలిస్తే వీగన్ డైట్ తీసుకున్నవాళ్లలో మొదటి నెలకే లిపోప్రొటీన్, కొలెస్ట్రాల్, బరువూ తగ్గడంతో గుండె ఆరోగ్యం మరింత మెరుగైనట్లు తేలింది. వీగన్ డైట్ వల్ల పొట్టలోంచి బ్యాక్టీరియా వృద్ధి చెందడంతోబాటు వృద్ధాప్యాన్ని తెచ్చే టీలోమీర్ల క్షీణత కూడా తగ్గిందట. కాబట్టి జంతు ఉత్పత్తులతో పోలిస్తే వీగన్ ఆహారమే మేలు అంటున్నారు నిపుణులు.




మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. sunmagvaartha@gmail.com





# లిప్ ప్లాంట్స్





**పర్యావరణంలో** ఎన్నో అద్భుతాలు ఈ ప్రకృతిలో మనకు కనిపిస్తుంటాయి. అందులో ఉండే అత్యంత అరుదైన వృక్ష సంపద మానవుడిని విస్తుపోయాలే చేస్తుంది. ఇంతవరకు ఎన్నో వింత మొక్కల్ని చూసి ఉంటారు. కానీ ఇలా లిప్‌స్టిక్ వేసిన పెదవుల్లా ఉండే అరుదైన మొక్కను గురించి విన్నారా? అదెక్కడుందంటే..? ఇలాంటి మొక్కలు కూడా ఉంటాయా అని ఆశ్చర్యపోవద్దు. ఎందుకంటే..?ఇలా మానవ పెదవులు పోలిన మొక్క ఈక్వెడార్, దక్షిణ అమెరికా వంటి దేశాల్లో ఎక్కువగా ఉంటాయి. సైకోట్రియా ఎలాటా లేదా హుకర్స్ లిప్స్ ప్లాంట్‌గా పిలిచే ఈ హాట్‌లిప్స్ ప్లాంట్ ఈ భూమ్మీద ఉండే వృక్ష జాతుల్లో అత్యంత అరుదైన మొక్కగా పేర్కొనవచ్చు. దీన్ని బొటానికల్ వండర్‌గా పిలుస్తారు. ఈ మొక్క ప్రత్యేకత ఏమిటంటే..బ్రాక్ట్స్‌గా పిలిచే ఈ మొక్క ఆకులు ఎర్రటిరంగులో మూనవ పెదవుల్లా కనిపిస్తాయి. ఇవి హమ్మింగ్‌బర్డ్స్, సీతాకోక చిలుకలు పరాగ సంపర్కంలో ఆకర్షించ









డానికి ఈ ఎర్రటి ఆకుల భాగమే సహాయపడుతుంది. అయితే ఈ మొక్క ఆకులు ఉన్నంత ఆకర్షణీయంగా వాటి పువ్వులు కనిపించవు. పువ్వులు పూసే ముందే ఇలా పెదవుల ఆకారంలో ఈ మొక్క కనిపిస్తుందట. దీని లోపలి నుంచి నక్షత్రాల ఆకారంలో తెల్లని పువ్వులు పుష్పిస్తాయి. మధ్య అమెరికాలోని ప్రజలు తమ కుటుంబ సభ్యులు లేదా స్నేహితులకు ప్రేమను వ్యక్తం చేయడానికి ఈ మొక్కను బహుమతిగా ఇస్తారట.

మరీ ముఖ్యంగా వేలంటైన్స్ డే రోజు ప్రేమికులు ఈ మొక్కను బహుమతిగా ఇస్తారట. దీని బెరడు, ఆకులను స్థానికులు చర్మ సంబంధ వ్యాధుల చికిత్సకు ఉపయోగిస్తారు. అయితే ఈ మొక్క ప్రస్తుతం కనుమరుగైపోతున్న జాబితాలో ఉందట. వాతావరణ మార్పులే ఇందుకు కారణమని పర్యావరణ ప్రేమికులు చెబుతున్నారు. భవిష్యత్తు తరాలకు ఈ హుకర్స్ లిప్స్ ప్లాంట్ తెలిసేందుకైనా ఇది అంతరించిపోకుండా కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# 'సంఘీ' భావం



# అందనంత ఎత్తులో సన్నాలు బియ్యం

**నెల** రోజుల వ్యవధిలోనే సన్నాలు రకం బియ్యం ధరలకు ఒక్కసారిగా రెక్కలు వచ్చాయి. సామాన్యుడు కొనుగోలు చేయలేని స్థాయికి ధరలు చేరాయి. బాస్మతి బియ్యం ధరలకు సమీపానికి క్రమంగా సన్నాలు చేరుతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో ప్రజలు ఎక్కువగా సన్నాలు రకం బియ్యాన్ని కొనుగోలు చేస్తుంటారు. రేషన్ షాపుల్లో ఇస్తున్న బియ్యం నాసిరకంగాను, దొడ్డుగాను ఉండటంతో కేవలం ఇడ్లీలు, దోసెలు వంటి టిఫిన్ల తయారీకి మాత్రమే ఉపయోగిస్తున్నారు. మధ్యాహ్నం, రాత్రి భోజనాల్లో మాత్రం సన్నాలు లేకపోతే ముద్దదిగే పరిస్థితి లేదు. సన్నాలు రకం బియ్యంలో అనేక రకాలు మార్కెట్‌లో లభిస్తుంటాయి, హెచ్ఎంటి, రా రైస్, బిపిటి, ఆర్ఎన్ఆర్ వంటివి లభిస్తున్నాయి. ఈ రకం బియ్యం రెండు మూడు నెలల క్రితం వరకు కిలో 45 నుంచి 50 రూపాయల వరకు ధర పలికేది. దీనితో మధ్యతరగతి కుటుంబాలు ఈ బియ్యాన్నే ఎక్కువగా కొనుగోలు చేస్తుంటాయి. ప్రస్తుతం మార్కెట్‌లో బియ్యం దిగుబడి గణనీయంగా తగ్గిందని చెబుతూ ధరలను అమాంతం పెంచేశారు. ప్రస్తుతం బిపిటి, హెచ్ఎంటి, రారైస్ రకాలు సుమారు 65 నుంచి 75 రూపాయల మధ్య చెల్లించాల్సి వస్తుంది. దీనితో ప్రజలు ఆందోళనకు గురౌతు న్నారు. తక్కువ ధరలో బియ్యం లభించినా ముద్దముద్దగా ఉండటం, నాసిగా ఉండటం జరుగుతోంది. సన్నాలు అర్థకిలో బియ్యం వండితే కుటుంబానికి సరిపోతే నాసిరకం బియ్యం 600 నుంచి 650 గ్రాములు అవసరం అవుతుంది. ధర కొంత తక్కువగా ఉన్నా రుచిలేకపోవడం, తక్కువ అన్నం రావడంతో సన్నాల వైపే మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి ప్రజలు ఆసక్తి చూపిస్తారు. బాస్మతి బియ్యం లూజుగా కిలో 80 నుంచి వంద రూపాయలు వరకు ఉంటుంది. ప్రస్తుతం సన్నాలు ధరలు బాస్మతి బియ్యానికి చేరువలోకి రావడం విశేషం. వానాకాలంలో సన్నాలు దిగుబడి తగ్గడం వల్లనే ధరలు పెరుగుతున్నట్లు వ్యాపా రులు చెబుతున్నారు. దిగుబడి ఒకపక్క తక్కువగా ఉండగా మరో పక్క మిల్లర్లు సైతం ఈ బియ్యాన్ని భారీగా కొనుగోలు చేయడం తో ఈ సమస్య వచ్చినట్లు తెలుస్తోంది. దొడ్డు బియ్యం ధర సుమారు క్వింటాల్‌కు 4,500 లోపుగానే ఉంటోంది. అయినా వాటిని కొనుగోలు చేయడానికి ప్రజలు ఆసక్తి చూపించడం లేదు. యాసంగి సీజన్‌లో దొడ్డు బియ్యం రకాలైన 1010, 1001, 1061, ఐఆర్ 64, తెల్లహంస వంటి రకాలను ఎక్కువగా దిగు బడి చేస్తారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో కొన్ని జిల్లాల్లో మాత్రమే సన్నాలు సాగు చేస్తున్నారు. అయితే ఈసారి నాగార్జునసాగర్ కింద ఆయకట్టు గణనీయంగా తగ్గడంతో సన్నాలు ఆశించిన మేరకు మార్కెట్ రాని పరిస్థితి ఏర్పడింది. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ కింద కూడా వాతావరణం అనుకూలించకపోవడంతో దిగుబడి గణనీయంగా తగ్గిపోయింది. సాధారణంగా ఒక్క తెలంగాణ రాష్ట్రంలోనే వానాకాలం సీజన్‌లో 99 మెట్రిక్ టన్నుల ధాన్యం మార్కెట్‌కు వస్తుంది. అయితే ఈసారి కేవలం 43 మెట్రిక్ టన్నులు మాత్రమే ఇప్పటి వరకు వచ్చింది. దీనితో ఒక్కసారిగా మార్కెట్‌లో సన్నాల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. గతంలో బిఆర్ఎస్ అధికారంలో ఉండగా సన్నాలు బియ్యం రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేస్తామని ప్రకటించారు. అయితే ప్రయోగాత్మ కంగా కొన్ని రేషన్ షాపుల్లో రెండు నెలల పాటు పంపిణీ జరిగిం ది. ఈ బియ్యం మార్కెట్‌లో దొరికే సన్నాల రకం నాణ్యత లేక పోయినా మధ్యతరగతి, నిరుపేదలకు కొంత ఊరట కలిగించింది. అయితే ఒకటి రెండు నెలల తరువాత మళ్లీ ఈ రకం బియ్యాన్ని రేషన్ షాపులకు పంపిణీ చేయలేదు. ప్రస్తుతం రేషన్ షాపుల్లో లభించే బియ్యం దొడ్డుగా ఉండటమే కాకుండా చెత్తాచెదారం, రాళ్లు అధికంగా ఉంటున్నాయి. దీనితో చాలామంది ఈ బియ్యా న్ని ఉచితంగా ఇచ్చినా తీసుకోవడానికి ఆసక్తి చూపించడం లేదు. కొందరు తీసుకున్నా గత్యంతరం లేక ఆ బియ్యాన్ని బ్లాక్‌మార్కెట్ కు తరలిస్తున్నారు. దీనితో ప్రభుత్వం అందించే బియ్యం వల్ల ప్రజలకు ఆశించిన మేరకు ప్రయోజనం కలగడం లేదు. తెలంగాణ లో కొత్తగా అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం సన్నాలు రకం ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. కేంద్ర ప్రభుత్వం 25 రూపాయలకే సన్నాలు రకం బియ్యాన్ని రేషన్ షాపుల ద్వారా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇప్పటికే ఉత్తరాది రాష్ట్రాల్లో గోధుమలు, గోధుమ పిండిని తక్కువ ధరకు పంపిణీ చేస్తోంది. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో కూడా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన బియ్యాన్ని మాత్రమే పంపిణీ చేసి చేతులు దులుపుకుంటున్నారు. ఎన్నికలకు ముందు బిజెపీ శ్రేణులు చౌకడిపోల వద్దకు వెళ్లి ఈ బియ్యం కేంద్రం ఇస్తోందని బోర్డులు పెట్టాలని డిమాండ్ చేయడం జరిగింది. కేంద్ర ఆర్థికశాఖా మంత్రి నిర్మలా సీతారామన్ సైతం ఒక రేషన్ షాపు వద్ద తనిఖీకి వెళ్లి రేషన్ అందిస్తున్న వివరాలు స్పష్టంగా చెప్పనందుకు ఐఎఎస్ అధికారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం మార్కెట్‌లో సన్నా లు ధరలు గణనీయంగా పెరుగుతున్న తరుణంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. రేషన్ షాపుల ద్వారా సన్నాలు ఇవ్వడానికి చర్యలు తీసుకుంటే బహిరంగ మార్కెట్‌లో సన్నాలు రకం ధరలు తగ్గడానికి అవకాశం కలుగుతుంది. ఒకేసారి వెయ్యి నుంచి రెండు వేల రూపాయలకు పెరగడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తగి న చర్యలు తీసుకుని సన్నాలు ధరలను అదుపుచేయకపోతే ప్రజల నుంచి వ్యతిరేకత పెరిగే అవకాశం ఉంది.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ



# సంక్రాంతి సోయగం

కవర్ స్టోరీ

పి.యస్.యమ్.లక్ష్మి

**సంక్రాంతి పండుగ వచ్చేసిందర్రా. అంటే బోలెడు సంబరాలు. సంబరాలంటే ముందు మన సర్దుడు కార్యక్రమాలు వుండాల్సిందే కదా. ఇల్లూ, వాకిలీ శుభ్రం చేసుకోవాలి. అనవసర సామానంతా తీసెయ్యాలి, మరీ ముఖ్యంగా చెక్క సామానయితే పిల్లలకి పండుగ. ఎందుకంటే అవన్నీ వాళ్లు వేసుకునే భోగిమంటల ఇంధనాలు కదా.**

అసలు అన్నింటికన్నా ముందు మిమ్మల్నందర్నీ కూర్చోబెట్టి పండుగ గురించి చెప్పాలనుందర్రా. మీరేమో వేటి గురించీ తెలుసుకోవాలనే శ్రద్ధ చూపించరు. ఏ పెద్దవాళ్లో అడిగినప్పుడు మాకు తెలియదు అంటారు. మాకు నచ్చటం లేదు ఇది. అందుకే మీకిష్టం వున్నా లేకపోయినా ఇవాళ మీ అందరికీ ఈ పండగ సందర్భంగా దీని విశేషాలన్నీ చెబుతాను. మన సనాతన సంప్రదాయాలని కాపాడాల్సినవారు మీరు. మీరు తప్పకుండా వినాల్సిందే.

కాలాన్ని లెక్కించటానికి అనేక పద్ధతులు వాడుతారు. లెక్కించటం ఎందుకు అంటారా? మనం ఏ నెలలో ఏ సంవత్సరంలో వున్నామో తెలియటానికి, ఫలానా సంఘటన ఎప్పుడు జరిగిందో చెప్పటానికి, ఒక మనిషి పుట్టినా, గిట్టినా, ఏదైనా ఘనకార్యం చేసినా అలాగే ఏదైనా గుర్తుంచుకోదగ్గ పని చేసినప్పుడు అది ఎప్పుడు చేశామో తెలియటానికి అంటే ఫలానా సంవత్సరం, ఫలానా నెల, ఫలానా రోజు అని చెబుతామే, దానిని గుర్తించడానికి ఈ లెక్కలవసరం. ఈ గణన మనం చంద్రమానం ప్రకారం చేస్తాం. అంటే చంద్రుడి చలనం ఆధారంగా వుంటుంది ఈ లెక్క. మనం చేసుకునే పండగలు, పుట్టిన రోజులు అన్నీ దీని ప్రకారమే. సూర్యమానం ప్రకారం చేసే లెక్క ఇంకోటి. మనకి పెద్ద పండగ అని చెప్పుకునే సంక్రాంతి ఎవరైనా ఈ సూర్యమానం ప్రకారం చేసుకునే పండుగ. ఎందుకంటే ఇది సూర్యగమనాధారంగా వచ్చే పండుగ.

సూర్యుడు సంవత్సరంలో 12 రాశుల్లోనూ సంచరిస్తాడు. సూర్యుడు ఒక రాశి నుంచి మరొక రాశికి వెళ్లే సమయాన్ని క్రాంతి అంటారు. ఇది శుభాలని ఇచ్చే క్రాంతి. అందుకే సంక్రాంతి. ఇంకొక విషయమేమిటంటే అప్పటివరకు దక్షిణ దిక్కుగా ప్రయాణం చేసిన సూర్యుడు అప్పటి నుంచి ఉత్తర దిక్కుగా పయనిస్తాడు. అదెలాగంటే, భూమి తన చుట్టూ తాను తిరుగుతూ సూర్యుడి చుట్టూ కూడా తిరుగుతుంటుంది కదా. అలా సూర్యుడి చుట్టూ భూమి తిరిగేటప్పుడు సూర్యుడు ఆరు నెలలు ఉత్తరం వైపు ఆరు నెలలు దక్షిణం వైపు కనిపిస్తాడు. ఇలా ఉత్తరం వైపు కనిపించే సమయం ఉత్తరాయనం, దక్షిణం వైపు కనిపించే సమయం దక్షిణాయనం. ఈ సంక్రమణ సమయం నుంచీ ఉత్తరాయన పుణ్యకాలం మొదలవుతుంది. ఈరోజు నుంచి స్వర్గద్వారాలు తెరచి ఉంటాయని పురాణాలు చెబుతున్నాయి. మరి ఉత్తరాయనం దేవతలకి పగటి సమయం కదా.

ఇది సూర్యుడి గమనానికి సంబంధించిన పండుగ కనుక ఈ పండుగ తేదీ పెద్దగా మారదు. సూర్య గమనం ఆధారంగా వచ్చే ఈ పండుగలో సూర్యుడే ప్రధాన దైవం.

ఈ మకర సంక్రమణం నుంచీ సూర్యుడి గమనం మారటం వల్ల, వాతావరణం కూడా మారుతుంది. అప్పటి వరకు ఉన్న చలి మకర సంక్రమణంతో తగ్గుముఖం పడుతుంది. పగటి సమయం ఎక్కువగానూ, రాత్రి సమయం తక్కువగానూ వుంటాయి. ప్రకృతి శోభించే వసంత కాలం మొదలవుతుంది. రైతులకు సంబరాలంబరాలంటే పండగ ఇది. ఎందుకంటే ఇది పంటలు చేతికి వచ్చే సమయం. అంటే రైతుకి కొంచెం తీరిక దొరికే సమయం.

దానితోబాటు ఏడాది పొడుగునా కష్టించి పని చేసిన రైతన్నకి పనుల నుండి కొంచెం విశ్రాంతి దొరికే సమయం. సంపద చేతిలో వుండి, తీరిక వుంటే ఆనందానికి హద్దేది. వారి ఆనందాన్ని అందరితో పంచుకునే ఉద్దేశమే ఈ పండుగ అంతరార్థం. మనది వ్యవసాయ ప్రధాన దేశం. కనుక అందరూ సంతోషంగా వుండే ఈ సమయంలో చేసుకునే ఈ పండుగ పెద్ద పండగ.



పెద్ద పండుగ కదా. కొత్తగా పెళ్లయిన ఆడపిల్లలని, అల్లుళ్లని ఇంటికి పిలిచి విందులు చేసి, కానుకలు ఇస్తారు. వారి ముచ్చట్లని సరదాల సయ్యాటలను చూడటం కూడా ఒక పండుగే.

ఈ పండుగ సంబరాలు పట్టణాలలో కన్నా పల్లెల్లో బాగా వుంటాయి. రైతుల ఆవాసాలక్కడే కదా మరి. అందుకే ఎక్కడెక్కడివారూ ఈ పండక్కి తమ ఊళ్ల ప్రయాణమవుతారు. అసలీ పండగ శోభ నెల రోజుల ముందు నుంచే అంటే ధనుర్మాసం నుంచే ప్రారంభమవుతుంది.

అసలు ధనుర్మాసం అంటే ఏమిటి? మాకు తెలుగు నెలలు, జనవరి, ఫిబ్రవరి తెలుసుగానీ ఈ ధనుర్మాసం తెలియదంటారా? మన చంద్రమానం ప్రకారం చంద్రుడు పౌర్ణమి రోజు ఏ నక్షత్రంలో వుంటే ఆ మాసంగా చెబుతాం కదా. మరి ఈ పండుగ సౌరమానం ప్రకారం చేసుకునేది అని ముందే చెప్పాను కదా. సౌరమాన ప్రకారం సూర్యుడు ధనుస్సు రాశిలో ప్రవేశించిన రోజు నుండి మకర రాశిలోకి ప్రవేశించేదాకా, ఈ మధ్య రోజులను అంటే సంక్రాంతికి ముందు ముప్పయి రోజులను ధనుర్మాసమని అంటారు. ధనుర్మాసం ప్రారంభం నుంచీ కన్నెపిల్లలూ, మహిళలూ ఇళ్ల ముందు వాకిళ్లల్లో తీర్చిదిద్దే రంగవల్లులు చూసి తీరాల్సిందే. ఒకరికన్నా ఒకరు పెద్ద ముగ్గులు, అందమైన ముగ్గులు వెయ్యటంలో పోటీ పడటమే కాకుండా, ముగ్గు వేసిన తర్వాత చుట్టుపక్కల ఇళ్లవాళ్లు ఎలాంటి ముగ్గులు వేసారో చూసి రావటం కూడా ఒక సంబరమే. వీటిని పండుగ రోజులలో పసుపు-కుంకుమలతో, రకరకాల రంగులతో అందంగా అలంకరిస్తారు.



అంతేకాదు.. గౌరీదేవిని ఆరాధించి, తమ కోరికలు చెప్పుకోవటం కూడా ఒక వేడుకే. ఆవుపేడ సేకరించి గొబ్బెమ్మలు చేసి అలంకరించి, ముగ్గులలో పెడతారు. వాటిని గౌరీదేవిలా కొందరారాధిస్తే, గోపికలుగా కొంతమంది భావించి పూజిస్తారు. సాధారణంగా ఈ గొబ్బెళ్లు ఉదయమే పెడతారు. ఈ నెల రోజుల మధ్యలో ఒకరోజు మాత్రం సందెగొబ్బెమ్మ అని సాయంకాలం పెట్టి స్నేహితులని పిలిచి దాని చుట్టూ తిరుగుతూ, పాటలు పాడుతూ, ఆటలాడుతూ సందడి చేస్తారు. చామంతి పువ్వులాంటి చెల్లెల్ని, తామర పువ్వులాంటి తమ్ముణ్ణి, చివరికి నునుసిగ్గుల మధ్య మొగలి పువ్వంటి మొగుణ్ణి కోరుకుంటారు. ఈ అందాలన్నీ చూసి తీరవలసిందే. ఆ ఉత్సాహం, సరదా, ముచ్చట్లు, మురిపాలు బస్తీ పేంటు షర్టుల్లో వుండవ్రా. మరి ఆ గొబ్బెమ్మలతో పిడకలు చేసి సంక్రాంతికి భోగి మంటల్లో కొన్ని వేస్తారు. ఇంకొన్నిటి మీద రథసప్తమినాడు పరవాణ్ణం చేసి సూర్యుడికి నైవేద్యం పెడతారు. ఆవుపేడ పిడకల మీద వండే ఆ పరవాణ్ణం రుచే వేరు. అంతే కాదు.. ఈ కాలం పర్యావరణ పెద్దలు చెప్పే సూక్తులు ఏనాడో మనవాళ్ల పాటించారు.

## హరిదాసుల సందడి

మహిళల ముగ్గులు, గొబ్బెళ్ళ కార్యక్రమం తదుపరి కార్యక్రమం 'హరిలో రంగ హరి' అంటూ నామ స్మరణ చేస్తూ వచ్చే హరిదాసుల హడావిడి. వీళ్ల ప్రత్యేకమైన వస్త్రధారణతో, తల మీద గుమ్మడికాయని పోలిన రాగిపాత్రతో, చేతిలో చిడతలతో తాళం వేస్తూ, నృత్యం చేస్తూ వస్తారు. కొత్త పంటలు వస్తాయి కదా. వారి పాత్ర నిండుతూ వుంటుంది. వారిని శ్రీకృష్ణ స్వరూపంగా భావించి, భక్తితో దానం చేస్తారు. వారి తల మీద వుండే పాత్రని భూదేవిగా భావిస్తారు. వాళ్లూ కొన్ని నియమాలు పాటిస్తారు. వారా పాత్రని ఎక్కడబడితే అక్కడ కింద దింపరు.

అంతే కాదండోయ్... చేతిలో డమరుకంతో "అంబ పలుకు జగదంబా పలుకు, కంచి కామాక్షీ పలుకు, మధుర మీనాక్షీ పలుకు" అంటూ బుడబుక్కలవారూ, గంట వాయిస్తూ జంగమ దేవర్లు, గంగిరెద్దుల చేత రకరకాల విన్యాసాలు చేయించేవారు, ఇంకా అనేకమంది వస్తారు. వీరంతా ధనుర్మాసం మొదలయినప్పటి నుంచీ ఇల్లిల్లూ తిరుగుతూ, వారి వారి రీతులలో భక్తిగీతాలు పాడుతూ తరతరాల వారిని దీవిస్తూ వుంటారు. మన దగ్గర ఉన్నదాన్ని నలుగురితో పంచుకోవడమే అసలైన పండుగ అని చెబుతుంది సంక్రాంతి. పంటలు పండి ధాన్యం ఇళ్లకి చేరుకునే సంక్రాంతి సమయం, దానం చేసేందుకు సరైనది. తమ స్థోమతని అనుసరించి వచ్చిన వారికి వచ్చినట్లు బియ్యాన్ని కొలిచి పోయడం రైతు కుటుంబాలకి



ఈ సమయంలో సంతోషకరమైన విషయం.

## పతంగుల పండుగ

ఇది పతంగుల పండుగ కూడా. ఎక్కడ చూసినా ఆకాశంలో విహరించే గాలిపటాలు కనబడతాయి. దీనికి ఒక ప్రత్యేకత వుంది. ఈ రోజుతో శీతాకాలం పూర్తవుతుంది. ఉదయం నుంచి గాలిపటాలు ఎగరేస్తూ సూర్యరశ్మిలో ఉండటం వల్ల ఎన్నో రకాల చర్మ వ్యాధులు తొలగిపోతాయని భావిస్తారు. ఆధ్యాత్మికంగా చూస్తే దేవతలు ఆరు నెలల తర్వాత నిద్ర నుంచి లేచే సమయం. దేవతలంతా ఈ కాలంలో ఆకాశంలో విహరిస్తారట. దేవతలకి స్వాగతం పలికేందుకు, వారి దృష్టిని ఆకర్షించేందుకు గాలిపటాలు ఎగరేయాలని చెబుతారు. అంతే కాదండీ, సంక్రాంతి ప్రత్యేకతలు ఇంకా వున్నాయి... కోడిపందేలు, ఎడ్ల పందాలు... మొదలయినవి అన్నీ రైతన్నలను ఉత్సాహబరితుల్ని చేసే మార్గాలు.

## భోగి

నాలుగు రోజులు జరుపుకునే ఈ పండుగ మొదటి రోజు భోగి. ఆరోజు సూర్యోదయానికి ముందే నిద్ర లేచి, భోగిమంటలు వేస్తారు. ఇంట్లో పనికిరాని చెక్క సామాను, అల్లరి పిల్లలు వేరే ఇంటి నుంచి ఎత్తుకొచ్చిన కర్రసామాను, గొబ్బెమ్మల పిడకలతో మంట వేసి చలి కాగుతారు. కొందరు ఆ మంట్లోనే బిందెలతో నీళ్ల కాచి తలస్నానం చేస్తారు. కొత్త బట్టలు ధరిస్తారు. భోగిరోజు ముందు రోజు బొమ్మల కొలువు ఏర్పాటు చేస్తారు. బొమ్మల కొలువు కోసం ఇప్పుడు ప్రత్యేకించి వస్తున్న అరలు మా చిన్నతనంలో లేవు. మా నాన్నగారు లోపల గదుల తలుపులని ఊడదీసి, డ్రమ్ముల మీద పెట్టి, తెల్లని ధోవతులు వేసి అరలు ఏర్పాటు చేసేవారు. అటక మీద నుంచి మూడు, నాలుగు బొమ్మల పెట్టెలు కిందకి దించేవారు. వాటిలో కాయితాలు చుట్టి జాగ్రత్త చేసిన బొమ్మలన్నీ జాగ్రత్తగా తుడిచి మా అమ్మకి అందిచ్చేవాళ్లం. కొలువు తీరిన బొమ్మలు చూసి ఎన్నో విషయాలు నేర్చుకునేవాళ్లం. బొమ్మల ముందు గౌరీదేవిని పెట్టి పూజ చేసేవాళ్లం. కొందరికి సంక్రమయ వుండేది. ఆయన కాలపురుషుడు. ఆయన ఎక్కి వచ్చిన వాహనం, వచ్చిన దిక్కు, ధరించిన బట్టలు, ఆయుధాలని బట్టి ఆ సంవత్సరం ఫలాలు చెప్పేవారు. అందరినీ పేరంటానికి పిలిచి సాయంకాలం బొమ్మమకి హారతి ఇచ్చేవాళ్లం. వాయనాలుగా నానబోసిన శనగలు, పండ్లు, తాంబూలం ఇచ్చేవాళ్లం.



చిన్న పిల్లలకి భోగిపళ్లు పోసేవాళ్లు. అంటే పిల్లలని కూర్చోబెట్టి, రేగుపళ్లు, నానబెట్టిన శనగలు, అక్షింతలు, పూలరేకులు, చిల్లర నాణేలు కలిపి, ముత్తయిదువలు పిల్లలకి ఆ మిశ్రమంతో దిష్టి తీసి తల మీద పోసేవారు. మిగతా పిల్లలు ఆ నాణేలు ఏరుకోవటానికి పోటీ పడేవాళ్లు. చిన్నవారికి తగిలిన దిష్టి పోతుందని ఒక నమ్మకం. సైన్సు ప్రకారం తల పై భాగంలో బ్రహ్మారంధ్రం ఉంటుంది. భోగి పండ్లను పోసి దానికి ప్రేరణ



కలుగచేస్తే పిల్లల్లో జ్ఞానం పెరుగుతుంది. సంక్రాంతి సూర్యుడి పండుగ, కాబట్టి సూర్యుణ్ణి పోలిన గుండ్రని రూపం, ఎర్రటి రంగు వున్నందువల్ల రేగుపండుకి అర్కఫలం అనే పేరు కూడా వుంది. సూర్యభగవానుడి ఆశీస్సులు పిల్లలకి లభించాలనే సూచనగా ఈ భోగిపండ్లను పోస్తారు.

రెండో రోజు సంక్రాంతి లేదా పెద్దల పండగ. ఈ రోజు తమ పూర్వీకులను స్మరించుకుంటారు. సంక్రాంతినాడు పెద్దలకు తర్పణం విడువటం ఆచారంగా వస్తోంది. మోక్షాన్ని ప్రసాదించే ఉత్తరాయన పుణ్య కాలంలో తమ పెద్దలకు సద్గతులు కలగాలని కోరుకుంటూ తర్పణాలు వదులుతారు. తెలంగాణాలో కొందరు దీనిని పెద్దల పండగ అంటారు. పెద్దల పేరు మీద స్వయంపాకం ఇచ్చే అలవాటు కూడా కొందరికి వుంది. ఈ సమయంలో గుమ్మడి పండుని దానం ఇస్తే పెద్దలు తరిస్తారనే నమ్మకంతో చాలా మంది గుమ్మడి పళ్లని దానం ఇస్తారు.

భగీరథులు గంగను భూలోకానికి తీసుకువచ్చి సగరులకు శాపవిమోచనం చేయించింది ఈరోజే అని ప్రతీతి. అందుకే వీలయితే గంగా స్నానం, వీలుకానివారు నదీ, సంగమ స్నానాలు చేస్తారు. క్రాంతులు, గ్రహణాలు వగైరా పర్వదినాలలో నదీ స్నానాలు, సంగమ స్నానాలు, దానాలు, జపాలు అశేష పుణ్యఫలాన్నిస్తాయంటారు.





సంక్రాంతినాడు తిలాదానం కూడా అత్యంత ప్రశస్తం. నువ్వు గింజలో నూనె ఉన్నట్లు పరమాత్మలో జగత్ ఉన్నదని గొప్ప సత్యాన్ని తిలలు తెలియజేస్తాయి. అందుకే దీన్ని 'తిల సంక్రాంతి' అని కూడా అంటారు. కొందరు నువ్వులు, మధుర పదార్థం కలిపి అందరికీ పంచుతారు. సంక్రాంతి సమయంలో ఇలా నువ్వులని వాడటంలో ఒక ఆరోగ్య రహస్యం ఉంది. ఈ సమయంలో సూర్యుని దిశ మారి నిదానంగా ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. నువ్వులని తినడం వల్ల, మారుతున్న వాతావరణానికి శరీరం అలవాటు పడుతుంది.

### కనుమ

మూడవ రోజు కనుమ పండుగ. దీనిని ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో రైతులు ఘనంగా జరుపుకుంటారు. ముఖ్యంగా రైతులు తమ పాడి పశువులను శుభ్రంగా కడిగి అలంకరిస్తారు. పూజిస్తారు. సంవత్సరమంతా తమతో పొలాల్లో కష్టపడి తమకి సిరులు చేకూర్చిన పశు సంపదకి కృతజ్ఞత తెలియజేసే పండగ ఇది.

మరి పండుగకి పిండివంటలు కూడా వుండాలి కదా. కొత్త ధాన్యం వస్తుంది కదా. దానితో పరవాణ్ణం, అరిసెలు వగైరాలు చేసి సూర్యుడికి నైవేద్యం పెడతారు. కొత్త బియ్యంతో అన్నం వండుకుంటే అరగదు. మరి కొత్త పంట భగవంతునికి సమర్పించాలి కదా. అందుకే ఈ పిండి వంటలు. కనుమనాడు మినుము తినాలి అని గారెలు కూడా.

మన సంగతి చెప్పాను. మరి మన దేశంలో వేరే రాష్ట్రాలలో కూడా ఈ పండగ జరుపుకుంటారు. అయితే ఒక్కో రాష్ట్రంలో ఒక్కో పేరుతో..

ఉత్తర భారతంలో నివసించే హిందువులు, సిక్కులు సంక్రాంతి పండగను మాఘీ అని పిలుస్తారు. గోవా, మహారాష్ట్ర, కర్నాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో మకర సంక్రాంతి అనీ, తమిళనాడులో పొంగల్ అనీ, మధ్య బఛారతదేశంలో సుకరాత్ అనీ, అస్సాంలో మఘ్ బిహు అనీ, పశ్చిమ బెంగాల్‌లో 'పౌష్ సంక్రాంతి' అని, గుజరాత్‌లో 'ఉత్తరాయణం' అనీ రాష్ట్రాల మార్పుతో పండుగ పేరు మారిందిగానీ పండుగ ఒకటే.

మన దేశంలోనే కాదర్రా. విదేశాలలో కూడా ఈ పండుగ వుంది. నేపాల్‌లో మాఘె సంక్రాంతి అని పిలుస్తారు. అక్కడ ప్రతివారూ ఆ రోజు తల్లి ఆశీర్వాదం తీసుకోవటం ముఖ్యం. ఒకవేళ ఇంటి యజమాని తల్లి కాలం చేస్తే తన పిల్లలతో పాటు భర్తని కూడా భార్యే ఆశీర్వదిస్తుంది. శ్రీలంకలో మకర సంక్రాంతిని 'సూర్యప్రకరణ్' అంటారు. వాళ్లకు కూడా ఇది పంటల పండుగే కావడంతో మతాలతో సంబంధం లేకుండా రైతులందరూ ఈ పండుగ చేసుకుంటారు. ప్రకృతిని, భూమాతను, పంటలను కాపాడమని సూర్యభగవానుడిని ప్రార్థిస్తారు. పాకిస్థాన్‌లో ఈ పండుగను సింధ్ ప్రాంతంవారు చేసుకుంటారు. సంక్రాంతిని వాళ్ల తిరుమూర్ అంటారు. కంబోడియాలో సంక్రాంతిని మోహా సాంగ్క్రాన్ అంటారు. నెల వేరు కానీ వాళ్లకీ ఇది పంటల పండుగే. వాళ్లకు పంటలు వచ్చేది ఏప్రిల్ నెల కావడంతో ఆ నెల పధ్నాలుగు నుంచి పదహారు వరకు వేడుకలు చేసుకుంటారు.

మన పెద్దలు ఈ పండుగలను వూరికే పెట్టలేదండి. ఆధ్యాత్మికతే కాదు, వైద్య విజ్ఞానం, తోటివారి పట్ల ప్రేమ వగైరా ఎన్నో విషయాలు ఆలోచించి వీటిని పెట్టారనిపిస్తుంది. పంటలు సమృద్ధిగా పండిన రైతన్న అందరి మేలు కోరి ఇంటికి వచ్చిన అభ్యాగతులకు తమ పంటను పంచటంలో ఉద్దేశం అందరూ పండగ చేసుకోవాలి, అందరూ సుఖంగా వుండాలి అనే కదా.


ఈ భూదేవికీ, ప్రకృతికీ, మానవులకూ, పశువులకూ అవినాభావ సంబంధం అనాది కాలం నుంచీ వున్నదని కదా. అందుకే పండుగలు దండగలు అనుకోకుండా వున్నంతలో ఎదుటి వారికి సహాయం చెయ్యటం అలవాటు చేసుకోవాలి. ❏





కృత్రిమంగా చెరువులూ చిన్నచిన్న కొలనుల లాంటివీ ఏర్పాటు చేసి, చేపలూ, రొయ్యల వంటివి సాగు చేస్తుంటారు రైతులు. ఈ పిల్లల్ని నీళ్లలో వదిలింది మొదలు–అవి పెరిగి పెద్దవై మార్కెట్‌లోకి వెళ్లే వరకూ పెట్టుబడి పెడుతూనే ఉండాలి. అవి తీగజాతి కూరగాయలైన బీర, సొర, కాకర, చిక్కుడు, గుమ్మడి, పొట్లకాయల వంటి రకరకాల పంటల్ని మెట్ట భూముల్లో సాగు చేస్తుంటారు. తీగలు చక్కగా అల్లుకోవడానికి పొలమంతా పందిళ్లు వేయాల్సి ఉంటుంది. ఒక్క తీగ ఎక్కువ స్థలంలో అల్లుకుపోవడం వల్ల మొక్కలు కూడా పెద్దగా వేయాల్సిన అవసరం

# లాభసాటి కూరగాయల సాగు



ఉండదు. అయితే ఆ పందిళ్ల కింద నీడ వల్ల బాగానే కలుపు పెరుగుతుంది. ఎప్పటికప్పుడు దాన్ని తీయించేస్తుండటం ఖర్చుతో కూడుకున్న పని. మరోవైపు నీడవల్ల అంతర పంటను కూడా సాగు చేయడం కుదరదు. పంటకు వచ్చే చీడపీడలకు రసాయనాలూ వాడాల్సి ఉంటుంది. అదే, ఒకే చోట చేపల్నీ తీగజాతి కూరగాయల్నీ సాగు చేస్తే ఎన్నో రకాలుగా మేలని నిరూపిస్తున్నారు కొందరు రైతులు. నీటిసాగునీ మెట్ట పంటనీ ముడి పెట్టడం ఎలా సాధ్యమనే కదూ అనుకుంటున్నారు. అది ఎంతో సులభమైన పద్ధతి. ఎలాగంటే..చేపల చెరువులకు చుట్టూ గట్లు ఉంటాయి. ఆ గట్ల మీద కూరగాయ మొక్కల్ని నాటి..చెరువుపైన పందిళ్లు చేసుకోవచ్చు. చిన్న మడులుగా చేసుకుని ఈ విధమైన సమగ్ర వ్యవసాయాన్ని చేసేవారూ ఉన్నారు. పందిరి ఏర్పాట్లు చేసుకున్నాక నీళ్లలో చేప పిల్లల్ని వదిలితే లోపల అవి పెరుగుతుంటే పైన కూరగాయలు కాస్తుంటాయి. పందిళ్లు ఎత్తుగా ఉండటం వలవల్ల చేపలకు ఆహారాన్ని చల్లడానికీ, వాటి ఆక్సిజన్ సరఫరాకీ ఎలాంటి ఇబ్బందులూ తలెత్తవు. ఆకుల మధ్యలోంచి వచ్చే కొద్దిపాటి ఎండ చేపలకు సరిపోతుంది.

## ఖర్చు తక్కువ

ఈ సమగ్ర సాగు విధానం వల్ల రైతులకు చాలావరకూ పెట్టుబడి కూడా తగ్గుతుంది. చెరువు గట్లకు తేమ ఉండటం వల్ల పని గట్టుకుని కూరగాయల పాదులకు నీళ్లు పెట్టాల్సిన పని ఉండదు. కలుపూ, చీడపీడల బెడదా వాటిని తీయించడానికి కూలీలూ, రసాయనాల వాడకం వంటివేమీ ఉండవు. చేపలకు ఆహారం వేయడానికి ఎలాగూ చిన్నపాటి పడవల్లో తిరుగుతుంటారు రైతులు. ఆ సమయంలోనే కాయల్ని కోసుకునే ఏర్పాటు చేసుకోవచ్చు. పైగా కూరగాయలు తరచూ కోతకు రావడంతో ప్రతి పదిరోజులకోసారి ఆదాయం చేతికొస్తుంటుంది. ఆ డబ్బునే చేపల చెరువుకు పెట్టుబడిగా వాడుతున్నారు ఆంధ్రప్రదేశ్, కేరళ, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన కొందరు రైతులు. మరికొన్ని ప్రాంతాల్లో చేపలూ–కాయగూరలతోపాటు పశువులకు మేతగా ఉపయోగించే అజొల్లాను కూడా సాగు చేసి ఎక్కువ మొత్తంలో లాభాలను ఆర్జిస్తున్నారు. రూపాయి బిళ్లంత ఆకులతో ఉండే అజొల్లా చేపల చెరువులకు మంచి ఎరువుగా కూడా పని చేస్తుంది.

సమగ్ర వ్యవసాయంలో భాగంగా ఒకేసారి రెండుమూడేంటీ అంత కంటే ఎక్కువ పంటల్నే సాగు చేసి ఒకచోట నష్టమొచ్చినా మరోచోట వచ్చే లాభాలతో దాన్ని పూడ్చుకోవచ్చు కదూ!





# కృత్రిమ మేధ ఆవశ్యకత..

**అది** వారణాసిలో కాశీ తమిళ్ సంగమం కార్యక్రమం. ఆయన హిందీలో మాట్లాడుతోంటే సభికులకు హెడ్‌ఫోన్‌లో తమిళంలో వినిపిస్తోంది. హిందీ అప్పటికప్పుడే తమిళంలోకి తర్జుమా అయ్యింది. భాషిణి సీఇఒ అమితాబ్‌నాగ్ ఇటీవల అందరి ముందు తన కుమార్తెకు యూపిఐ ద్వారా డబ్బులు పంపించారు. కేవలం ఫోన్‌కు మాటలతో ఆదేశాలు ఇవ్వడం ద్వారానే. అదీ హిందీలో మాట్లాడుతూ! దేశీయ భాషలోనూ ఆన్‌లైన్ సేవలు పొందటం సాధ్యమేనని ప్రత్యక్షంగా నిరూపించారు. భాషా వైవిధ్యానికి మనదేశం పెట్టింది పేరు. మన దగ్గర 400కు పైగా భాషలు, యాసలున్నాయి. ఒక్క హిందీలోనే 48 యాసలను అధికారికంగా గుర్తించారు. బెంగాలీలో సుమారు 50 రకాలు కనిపిస్తుంటాయి. మన తెలుగు నేల మీద వేర్వేరు యాసల్లో మాట్లాడటం తెలిసిందే. కానీ కృత్రిక మేధలో కీలకమైన ఎల్ఎల్ఎం (లార్జ్ లాంగ్వేజ్ మోడల్)లకు ప్రధానంగా ఇంటర్నెట్ డేటాతోనే శిక్షణ ఇస్తుంటారు. ఇది చాలావరకు ఆంగ్లంలోనే ఉంటుంది. వెబ్ కంటెంట్ విషయంలో అత్యధిక ఆదరణ పొందింది ఆంగ్లమే. సుమారు 59శాతం వెబ్‌సైట్లు ఇంగ్లిష్‌లోనే ఉంటాయి. రెండోస్థానంలో రష్యన్ (5.3శాతం). మూడో స్థానంలో స్పానిష్ (4.3శాతం) నిలుస్తున్నాయి. డిజిటల్ వ్యత్యాసానికి ఇంతకన్నా నిదర్శనం ఇంకేం కావాలి? ఆంగ్లం కన్నా ప్రాంతీయ భాషల్లో ఏఐ నమూనాలకు ఎక్కువ శిక్షణ ఇవ్వాల్సిన అవసరముందనే విషయాన్ని ఇది చెప్పకనే చెబుతోంది. నిజానికి మనదగ్గర అంతర్జాల వాడకం తక్కువేమీ కాదు. ఇంటర్నెట్ అండ్ మొబైల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా గత సంవత్సరం విడుదల చేసిన నివేదిక ప్రకారమే మనదేశంలో 69.2 కోట్లమంది తరచూ అంతర్జాలాన్ని వాడుతున్నారు. వీరిలో గ్రామీణులను తక్కువ అంచనా వేయటానికి లేదు. ఆ మాటకొస్తే పట్టణాల్లో కన్నా గ్రామాల్లోనే ఇంటర్నెట్ వాడకం ఎక్కువ. పట్టణ ప్రాంతాల్లో 34.1 కోట్లమంది, గ్రామీణ ప్రాంతాల్లో 35.1 కోట్ల మంది అంతర్జాలాన్ని వాడుతున్నారు. వీరి సంఖ్య రోజురోజుకూ పెరుగుతూనే వస్తోంది. మనదేశంలో 2025 నాటికి 90 కోట్లమంది ఇంటర్నెట్‌ను వాడొచ్చని అంచనా. ఈ పురోగతిలో వాయిస్ సేవలు, దేశీయ భాషలే కీలకపాత్ర పోషించనున్నాయని భావిస్తున్నారు. ఇక్కడే కృత్రిమ మేధ శిక్షణలో ప్రాంతీయ భాషలు ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి.

## కృత్రిమ సంచలనం

ఇటీవల ఓలా సంస్థ మొట్టమొదటి పూర్తిస్థాయి దేశీయ కృత్రిమ మేధ సొల్యూషన్ 'కృత్రిమ్ ఏఐ'ని పరిచయం చేసి సంచలనం సృష్టించింది. జీపీటీ-4, ఎల్ఎల్ఏఎంఎ-2తో కూడిన దీని ప్రత్యేకతలేంటో చూద్దాం.

**పేరుకు తగినట్టుగా:** దీని ప్రత్యేకత పేరులోనే కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. ఆర్టిఫిషియల్ అనే ఆంగ్ల పదానికి సంస్కృతపదమైన కృత్రిమ్ అతికినట్టు సరిపోతుంది. భారతీయ సంస్కృతి, భాషా వైవిధ్యాన్ని ఇది చెప్పకనే చెబుతోంది.

**బహుభాషా నైపుణ్యం:** కృత్రిమ్ 20 భారతీయ భాషలను అలవోకగా అర్థం చేసుకోగలదు. మరాఠీ, హిందీ, తెలుగు, కన్నడ, ఒడియాతోపాటు మొత్తం 10 భారతీయ భాషల్లో కంటటెంట్‌ను సృష్టించగలదు. కృత్రిమ మేధ భాషా సమ్మేళనం దిశగా ఇదో గొప్ప ముందడుగు కాగలదని భావిస్తున్నారు.

**సంస్కృతికి ప్రాధాన్యం:** భారతీయ ఘన వారసత్వాన్ని ప్రతిబింబించేలా కృతిమ్‌ను తీర్చిదిద్దారు. పాశ్చాత్య దేశాల డేటాతో శిక్షణ ఇచ్చే ఏఐ నమూనాలకు ఇది భిన్నమైందని భావిస్తున్నారు.

కేవలం అక్షరాలతోనే కాదు, మాటల రూపంలో వచ్చే ఇన్‌పుట్స్‌కూ కృత్రిమ్ స్పందిస్తుంది.

దీంతో ఇంటరాక్షన్, యాక్సెసబిలిటీ ఎక్కువగా ఉంటుంది. సంభాషణల సమయంలో ఇది రాత నుంచి మాటలకు..అలాగే మాటల నుంచి రాతకు తేలికగా మారగలదు.

**ప్రత్యక్ష కోడింగ్ సామర్థ్యం:** ఆవిష్కరించే సమయంలోనే ఇది అప్పటికప్పుడు కోడింగ్ రాసే గుణమూ కలిగి ఉన్నట్టు నిరూపించుకుంది. పారిశ్రామిక వేత్తలకిది ఎంతగానో ఉపయోగపడనుంది.

వచ్చే నెలల్లో మరింత అధునాతనమైన కృత్రిమ ప్రో వర్షన్‌ను ఆరంభించటానికి ఓలా సన్నద్ధమవుతోంది. ❐

**రంగులతో** మెరిపిస్తుంది
అంకెలతో మురిపిస్తుంది
కొందరికి అన్నీ దరి చేరుస్తుంది
మరెందరికో అందనంత ఎత్తులో
అందని ద్రాక్షగా ఊరిస్తుంది
మొత్తానికి మైమరపిస్తుంది!
మనుషుల మధ్య 'ప్లాస్టిక్' ప్రేమలు
పెంచుతుంది-దూరాన్ని తగ్గిస్తుంది
చిచ్చు రేపుతోంది-బుర్రను బంధిస్తుంది
ఉరుకులు పరుగులు పెట్టిస్తుంది
రేపటి కోసం కలల్ని మోసుకు వస్తుంది!



# పచ్చనోటు పరపతి

ఈరోజు కడుపు మంటను చల్లారుస్తుంది
నిన్నటి దాంట్లో మిగిల్చుకోమని చెప్తుంది
ఉన్నదంతా ఊడ్చేయకని బోధిస్తుంది
భవిష్యత్తు భద్రతకై హెచ్చరిస్తుంది
పుట్టుక నుండి చావు దాకా తోడుంటుంది!
శాసిస్తుంది.. శపిస్తుంది/ ఒక్కోసారి కనికరిస్తుంది
విచ్చలవిడి ఒద్దంటూ హెచ్చరిస్తుంది
ఒకేలా ఉండమని బతిమిలాడుతుంది
అయినా మనం వినం!
ఉన్నప్పుడు ఊగుతాం
లేనప్పుడు కుంగుతాం
అప్పులకై పాకులాడుతాం
అడ్డదారులకై అన్వేషిస్తాం
ఎంతున్నా-ఏమున్నా
బంధాలే ముఖ్యమని విలువైన
భావాలే మంచిదని మర్చిపోతాం
మనసుకు నచ్చినట్టు ఉండొచ్చు
మంచిదైతే.. చెడు వైపు అడుగులేస్తే
బతుకు పాతాళమే-గ్రహించమని పెట్టే
పరీక్షలు పట్టించుకోం-అందుకే
ధనం మూలం మిదం జగత్!

**- న్యాలకంటి నారాయణ**

---

## ఈవారం కవిత్వం

# నీ కోసం!

**నీ** ప్రాపకం కోసం
ప్రపంచాన్ని పట్టించుకోక
అంతులేని ఆరాటపడి
అలసిపోని పోరాటం చేస్తూ!
ఎన్నో వాసంతాలని
ఎన్నెన్నో శరత్తులని
మరెన్నో హేమంతాలని
ఆస్వాదించక గుడ్డిగా వదులుకున్నా!
స్వాతిముత్యపు జల్లుల వెల్లువకు
తడిసిముద్దై మురిసిపోక
నీకై అనునిత్యం పరితపిస్తూ
నిను పొందాలని వెంపర్లాడా!
ఎదురొచ్చి కలిసొచ్చే విలువైన కాలాన్ని
చిదిమి ఛిద్రంజేసి మింగేసి
నీ దాహార్తి తీరునని
ఎండమావులెంట
పరుగులో
మునిగితేలా!
గ్రీష్మపు
ఎండతీరున్న
మిసిమివేడి ఈడు దాటిపోయె
భ్రమలలోనే సాగుతూ జీవితం
పొద్దువాలు సంధ్యలోకి చేరిపోయె!
వాస్తవ లోకంలోకి జారిపడి
ఆశలు రాలి బతుకు శిశిరపు మోడాయె
వెంటపడ్డ ఎండమావులూ మాయం
సొగసైన కాలం ప్రాయం మటుమాయం!
జీవితపు అద్దంలోకి తొంగిచూస్తే
గతం తాలూకు జ్ఞాపకాలన్నీ
అహోరాత్రాలు నీ గురించి అర్రులు చాచడమే
విఫల ప్రయత్నమైన ఓ కోరుకున్న గమ్యమా!



**- రవికిషోర్ పెంట్రాల**

## పుస్తక సమీక్ష



## జీవిత పోరాట 'డాక్యుమెంటరీ స్టోరీస్'

కథా ప్రపంచంలో కథను కొత్తమార్గంలో నడిపించిన త్రిపుర కథలు, నగ్నముని విలోమ కథలులాగే దేవరాజు మహారాజు యీ 'డాక్యుమెంటరీ స్టోరీస్' ఒక కొత్తపంథాలో సాగాయి. దాదాపు అన్ని కథలలా సామాజిక అంశాలతోనే సాగుతాయి. కథా సంవిధానంలో కొంత కొత్తదనం కనిపిస్తాయి. భారతీయ సమాంతర సినిమాలా ఈ డాక్యుమెంటరీ స్టోరీస్ ఉంటాయి. జర్నలిస్ట్ యాదవ్ ఇంట్లోంచి బయలుదేరటం బంతి ఆడుకొనే కొడుకు రోహణ్‌తో 'జీవిత పోరాటం' కథ ప్రారంభమవ్వడం బస్సు శాసనసభ సెక్రటేరియట్ మధ్య ఆగిపోవడం పత్రికా కార్యాలయంకు ఎలా చేరాలో తెలియక, షాపులముందు నిలబడటం పాతబస్తీలో అల్లర్లు, పోలీసువ్యాన్ అక్కడ హడావుడి చేయడం ఓ గ్రంథాలయంలోకి యాదవ్ వెళ్లడం పత్రికలు చూడటం నిజాలు, వాస్తవాలు చెప్పాలి అనే దృక్పథంతో బైటకు రావడం, కథాంశం. ఇది 1982లో రాసిన కథ..ఓ జర్నలిస్ట్ దినచర్య డాక్యుమెంటరీలా రాయడం బాగుంది. ఆదిమానవుడు ఆధునిక మానవుని సంభాషణ, వారి మధ్యకు వచ్చిన ప్రకృతిమాత స్త్రీ.. ముగ్వురి సంభాషణలతో కథ పర్యావరణ విధ్వంసంపై సాగుతుంది. దాదాపు 8 కథలూ పాఠకుల్ని ఏకబిగువున దృశ్యమానం చేస్తూ చదివిస్తాయి, ఆలోచింపచేస్తాయి.

**(డాక్యుమెంటరీ స్టోరీస్, రచన: డాక్టర్ దేవరాజు మహారాజు, వెల: రూ.50, ప్రతులకు: అన్ని ప్రముఖ బుక్‌హౌస్‌లు)**

**- తంగిరాల చక్రవర్తి**

## కలం కుంచె చెప్పిన ఆత్మకథలు



డా॥ సజ్జాజయదేవ్‌బాబు తెలుగు సాహితీప్రియులకు 'జయదేవ్ కార్టూనిస్ట్'గా చిరపరిచితులు. బాపూ రమణల సమకాలికులు. నేలబారు కార్టూన్‌లను గీయకుండా, సత్యమూర్తి, సాంబు, శంకు, చంద్ర, రామకృష్ణ లాంటి లబ్ధ ప్రతిష్టులలో అగ్రజుడై నిలిచారు. సీనియర్మోస్ట్ కార్టూనిస్టుగా పేరుగాంచారు. 'జయదేవ్ కార్టున్లు', 'జర్నీవిత్ జయదేవ్'లాంటి వీరి పుస్తకాలు ప్రశంసలు పొందాయి. లోగడ గ్లాచ్చుమీట్యూ-1 వెలువరించారు. తన పర్సనల్ స్టోరీస్ మిత్రుల తో సంతోషంగా పంచుకోవాలని మొదటి భాగం 2009 ప్రకటించారు. ఇది ఆ పరంపరలో రెండవది. తాను కలిసిన ప్రముఖులు, తన కుటుంబ సభ్యులు, అక్కినేని, బాలు, విజయ బాపినీడు, బాపు, దేశఖ్యాతిగాంచిన మేరియో మిరాండ, ఆర్.కె.లక్ష్మణ్‌లాంటి ప్రముఖులతో జయదేవ్‌గారెదుర్కొన్న సంఘటనలు, వారిని తన వ్యక్తిత్వంతో ఎలా 'ఇంప్రెస్' చేసింది తెలియ చేస్తున్నారు. ఆత్మకథలే అయినా, వ్యక్తుల వారీగా వివరించటం వల్ల పాఠకుడికి విసుగు పుట్టదు. పైపెచ్చు, రచయిత గురించి, 'ఇంటరాక్ట్' అయిన ప్రముఖుడి గురించి తన 'కలం నేత్రం' గుండా పరిశీలించి పొందుపరచటం వల్ల, ఆ,యా,వ్యక్తుల ప్రత్యేకతలు పాఠకులకు అవగతమౌతాయి. నాటి మద్రాసుకు వలస వెళ్లిన తెలుగు నాయుడ్ల భాష, యాస, బావుంది. మొదటి భాగం పైవచ్చిన పాఠకుల స్పందన సంపుటిలో కొత్త ఫీచర్! **(గ్లాచ్చుమీచ్యూ2 పర్సనల్ స్టోరీస్, రచన: జయదేవ్, వెల: రూ 225, ప్రతులకు: విజయవాణి ప్రింటర్స్)** **- కూర చిదంబరం**

## నానీకరించిన 'సాఫ్ట్‌వేర్'



రెండు దశాబ్దాలుగా 'సాఫ్ట్‌వేర్' ఇంజినీరుగా ఉద్యోగిస్తున్న కుడికాల వంశీధర్ వెలువరించిన రెండవ నానీల పొత్తం 'సాఫ్ట్‌వేర్ నానీలు'. కంప్యూటర్‌కు ఒక క్రమపద్ధతిలో యిచ్చే 'కోడ్' లను (ఆదేశాలను) ప్రోగ్రాంగా రాస్తే అలాంటి ప్రోగ్రాల సమాహారమే 'సాఫ్ట్‌వేర్' అంటారు వంశీధర్. ఈ సంపుటిలో కంప్యూటర్, సాఫ్ట్ వేర్, హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల జీవితం, వారి పని వాతావరణంతోబాటు జనసామాన్యానికి పరిచయం కాని అసంఖ్యాక సాంకేతిక పదాలతో నానీలను సృజించారు కవి. 'సాఫ్ట్‌వేర్ అంటే/ మనిషి సత్తాలే' 'కంప్యూటర్‌ను పని చేయించేది/ సాఫ్ట్‌వేర్' 'హార్డ్‌వేర్ అంటే/ పైన వుండే తొడుగు/ సాఫ్ట్‌వేర్ ప్రాణం/ దానిదే అసలు అడుగు' అంటూ సాఫ్ట్‌వేర్ పట్ల పండితులకు అవగాహన కలిగించే అనేక లఘు కవితల్ని ఆస్వాదించవచ్చు. 'కంప్యూటర్ పిత' ఛార్లెస్ బాబెజ్‌ను స్మరిస్తు, 'వెబ్‌సృష్టికర్త' టిమ్ బెర్నర్స్‌లీకి నివాళులర్పిస్తు నానీకరించిన తీరు బాగుంది. 'విశ్వమంతా కంప్యూటర్ గుప్పిట్లో' అన్నది నానుడి. కానీ దొరకనివి కూడా వున్నాయంటారు కవి. 'గూగుల్‌లో/ అన్నీ దొరుకుతాయి/ ఆమెదుఃఖానికి/ కారణం తప్ప' 'మనసులో ఏముందో/ ప్రింటవుట్ తీయండి/ అమ్మో!/ కనబడని విషం యింతుందా!' ఏరుతూపోతే మానవసంబంధాలపై మంచి నానీలు చాలానే వున్నాయి. ముమ్ముందు వంశీధర్ వచన కవిత్వంపై దృష్టిసారిస్తాడని నా విశ్వాసం. **(సాఫ్ట్‌వేర్ నానీలు, రచన: వంశీధర్, వెల: రూ 120, ప్రతులకు: 2-108/7/38/1, బి.ఎల్.నగర్, హైదరాబాద్)** – రమణ వెలమకన్ని

## డా॥ రాధశ్రీ కవితా రోచిస్సులు



డా॥ రాధశ్రీ 35వ పద్యసంపుటిగా 'రాధశ్రీ రోచిస్సులు' (ఖండకావ్యం) ప్రచురింపచేసారు. తెలుగువాడుక భాషలో, సామాన్య చదువరులకు అత్యంత సులభంగా కమనీయమైన శైలితో, ఆసక్తికరంగా ఏభాషలోను లేని విశిష్ట అపురూప ప్రక్రియ అయిన పద్యాన్ని గత అర్థశతాబ్దిగా 3000పై చిలుకు రచనలు, 150 గ్రంథాలకు పీఠికలు, పలకరిస్తే పద్యం ప్రదర్శనలు, పన్నెండు గంటల పద్యధారణ, ధారవాహికలు పద్య కవిత్వంలో అగ్రేసర కవిగా డా॥రాధశ్రీ ఆశుధారా విలసత్కవిగా విలసిల్లుతున్నారు. ఈ పద్య సంపుటిలో 'వేదన' శీర్షికన పద్యరామాయణ సృష్టికర్త మొల్లమాంబ, 'త్యాగం', కొండవీటి ప్రభువు ఆస్థానవర్తకి లకుమాదేవి ప్రాణత్యాగం, 'వీరపత్ని'గా ఖడ్గతిక్కన భార్య చానమ్మ, 'ప్రేరేపణ'లో బాలచంద్రుని ఇల్లాలు మాంచాల, 'ఆంధ్రవీరుడు' తాండ్రపాపారాయుని సాహసగరిమ, 'సింహం'లో ఆంధ్రకేసరి ప్రకాశం నిర్భయసాహసం, 'హూమాం'లో హాలునికథనం, 'దేశభక్తి'లో విశ్వనాధ నాయకుని ఘట్టం, 'న్యాయశీలం'లో మాధవవర్మ సత్యసంధత, 'అమరజీవి' పొట్టిశ్రీరాములు ఆత్మత్యాగం వంటి సన్నివేశాలను, చారిత్రక, అద్భుత కథనాలను పద్యరూపంగా రాధశ్రీ ఖండకావ్యంగా సృష్టించారు. తపస్విగా ఈ కావ్యం రోచిస్సులు ప్రసరింపచేస్తోంది. **(రాధశ్రీ రోచిస్సులు (ఖండకావ్యము), రచన: డా॥రాధశ్రీ, ఇ.నం. 3-7/2, నాగారం, హైదరాబాద్)** **– యర్రమిల్లి**



# మనం మారుదాం!

**డాక్టర్ ఎన్.బి.సుధాకర్‌రెడ్డి,**
సైకాలజిస్ట్

**భార్య మీద కోపంతో ఓ** కసాయిభర్త, గదిలో నిద్రిస్తున్న భార్య, రెండేళ్ల కుమార్తెను పాముచేత కరిపించి, చంపేశాడు. ఈ కిరాతక సంఘటన తాజాగా ఒడిశాలో జరిగింది. మృతురాలి బంధువుల ఫిర్యాదుతో పోలీసులు అసలు విషయాన్ని ఛేదించారు. భార్య, కన్నకూతురిని కాటికి పంపిన ఆ కసాయి వ్యక్తి కటకటాల పాలయ్యాడు. అనుమానం, వివాహేతరబంధాలు, వ్యసనాలు, ఇతర కారణాలతో కట్టుకున్న భార్య, కన్యబిడ్డల్ని చంపుకుంటున్న భర్తలను గూర్చి అప్పుడప్పుడు వార్తలు వస్తున్నాయి. అలాగే ప్రియునితో కలిసి భర్తను మట్టుపెట్టిన భార్యల గుట్టురట్టవుతున్నది. హైదరాబాద్ సూరారంలోని ఓ డయాగ్నొస్టిక్ సెంటర్‌లో పనిచేసే 26ఏళ్ల యువకుడు మహిళలకు వాట్సప్‌లో అశ్లీల సందేశాలు పంపేవాడు. వేధింపులు భరించలేని కొందరు మహిళలు ఆ పోకిరిని పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. గంజాయికి బానిసైన అతను ఉన్మాదిలా ప్రవర్తించి, జైలుకు వెళ్లాడు. సామాజిక మాధ్యమాలలో ఇలాంటి ఆకతాయిలు రోజురోజుకు పెరిగిపోతున్నారు. కొందరు యువతులు మహిళలు కూడా ఇలాంటి నీతిబాహ్య చర్యలకు పాల్పడుతున్నారు. ఐఐటి కాన్పూర్ ప్రొఫెసర్ (53) ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. మెకానికల్ ఇంజినీరింగ్ హెడ్ అయిన ఆయన విద్యార్థులకు పాఠం చెపుతూ స్టేజీపైనే కుప్పకూలి మరణించారు. ఐదేళ్లుగా ఆయన అధిక కొలెస్ట్రాల్‌తో బాధపడుతున్నట్లు తెలిసింది. ఇటీవలకాలంలో 25,30 ఏళ్ల యువకులు కూడా గుండెపోటుకు గురవుతున్న సంఘటనలు వెలుగు చూస్తున్నాయి. ఆఖరికి గుండె వైద్యనిపుణులు, డాక్టర్లు కూడా గుండెపోటువల్ల అకాలమరణాల పాలవుతున్న వార్తలు వస్తున్నాయి. చెన్నైలో ట్రయాంగిల్ ప్రేమ హత్యకు దారితీసింది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగి నందిని (25) వెట్రిమాణిమారన్‌ను ప్రేమించింది. తరువాత అతడు ట్రాన్స్‌జెండర్ అని తెలియడంతో రాహుల్ అనే యువకుడితో ప్రేమలో పడింది. అయితే రాహుల్‌ను మణిమారన్ కూడా ప్రేమిస్తున్నట్లు తెలుసుకున్న నందిని అతడిని మందలించింది. మణిమారన్ కోపంతో ఓ చెరువు వద్దకు తీసుకెళ్లి కాళ్లు చేతులు కట్టేసి సజీవదహనం చేశాడు. ఈమధ్యకాలంలో ప్రేమహత్యలు, ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయి. ప్రేమకోసం తల్లిదండ్రులను హతమార్చిన వారి కథనాలు సమాజాన్ని కలవరపరిచాయి.

**విస్మయపరుస్తున్న విపరీతాలు**

వర్తమాన సమాజంలో విస్తరిస్తున్న విపరీత ధోరణులు సామాజికవేత్తలను కలవరపరుస్తున్నాయి. విజ్ఞానం సాంకేతిక పరిజ్ఞానం ఆకాశం అంత ఎత్తుకు ఎదిగిన నేపథ్యంలో కొందరి ప్రవర్తన ఎందుకు పతనానికి దారితీస్తున్నదో అర్థం కావడం లేదు. విద్య, విజ్ఞానం పెరుగుతున్న దశలో వివేకం కోల్పోయి ప్రవర్తిస్తున్న వారిలో వికాసం కల్పించడం ఎలా అన్న మీమాంస తలెత్తుతున్నది. దీనికి ముందు కారణాలు, ప్రేరకాలను గూర్చి తెలుసుకుని విశ్లేషించవలసిన అవసరం ఉంది. తరువాత సామాజిక చైతన్యం, మానసిక వికాసం పెంపొందించేందుకు కృషి చేయాలి. అలాగే సామాజిక వ్యవస్థలు, సంస్థలను పటిష్ట పరచాలి. అవసరం అయితే పునర్నించాలి. ఇటీవల అనకాపల్లిలో ఆర్థిక సమస్యలు తట్టుకోలేక ఒక వ్యక్తి తనతోపాటు తన భార్య, ఇద్దరు పిల్లలతో సహా ఆత్మహత్య చేసుకున్నారు. ఇలాంటి సంఘటనలు అప్పుడప్పుడు మనకు కనిపిస్తుంటాయి. ఈ విషయం తెలిసిన ప్రతివారు అయ్యో పాపం అంటూ నిట్టూరుస్తారు తప్ప ఎందుకు ఇలా జరుగుతోందని ఆలోచించరు. ఇలాంటి సంఘటనలకు మూలం వ్యవస్థలలోని లోపం అంటే తప్పుకాదు. ఒక వ్యక్తి శక్తికి మించి అప్పులు చేయడం వెనుక అధికశాతం స్వార్థం, అత్యాశ, ఆడంబరాలు, విలాసాలు దాగి ఉంటాయి. దురదృష్టవశాత్తూ అప్పుల పాలయిన వారు చాల అరుదుగా ఉంటారు. అలాగే అధికశాతం వడ్డీలు ఆశించి, చితికిపోయిన వారికి అప్పులు ఇచ్చేవారు కూడా ఒక విధంగా తప్పు చేసినట్టే. అప్పులు ఇచ్చినవారు ఇళ్లపైబడి వేధిస్తుంటే పట్టించుకోని ఇరుగుపొరుగు పోలీసులను తప్పుబట్టక తప్పదు. అలాగే అప్పులకు తిప్పించుకునే



బ్యాంకులు, సంవత్సరాల తరబడి తీర్పులు చెప్పని కోర్టులు, వికాసం కల్పించని విద్యాసంస్థలు, విచ్ఛిన్నమౌతున్న కుటుంబ వ్యవస్థలాంటివి అన్నీ బాధ్యత వహించక తప్పదు. సమాజంలో ప్రతివ్యక్తి ఒక భాగస్వామి వ్యక్తిపై సామాజిక పరిస్థితులు ఎక్కువ ప్రభావం చూపుతాయి. వ్యక్తులు చేసే తప్పులు, పొరపాట్లు సమాజాన్ని ప్రభావితం చేస్తాయి. అందుకే రాతియుగం నుంచి పరిణామక్రమంలో సమాజం ఎన్నో మార్పులు పొందుతున్నది. కొన్ని వ్యవస్థలు, సంస్కృతీ, భావజాలం వేళ్లూనుకుంటున్నది. అయితే కొన్ని ఆధునిక పోకడలు, విషసంస్కృతి, స్వార్థపూరిత వ్యక్తులు, స్పృహలేని కొన్ని మీడియా సంస్థలు వ్యవస్థలకు చీడలా పరిణమిస్తున్న విషయం కాదనలేము. ఆది నుంచి ఎందరో మహానుభావులు, సామాజికవేత్తలు తమ జీవితాలను పణంగా పెట్టి సమాజం కుళ్లును కడుగుతూ వస్తున్నారు. అయితే ఇప్పుడు అలాంటి వ్యక్తులు, ప్రయత్నాలు కనిపించడం లేదు. ఒకప్పటి వ్యవస్థీకృత విశ్వసనీయత ఇప్పుడు బాగా తగ్గిపోయింది. ధర్మాన్ని, చట్టాలను కాపాడవలసిన వ్యక్తులు కొందరు స్వార్థంతో అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారు. దాదాపు అన్ని వ్యవస్థలు, వృత్తులలోను కొందరు స్వార్థపరులు జొరబడి కలుషితం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వ్యక్తినిర్మాణం, సామాజిక చైతన్యం కోసం కృషి చేయాల్సిన అవసరం ఉంది.

## వికాసమే విరుగుడు

ఆధునికి జీవనశైలి, వ్యవహారాలు, విలువలు కలుషితం అవుతున్నాయి. నీటికాలుష్యం, వాయుకాలుష్యం కంటే భావకాలుష్యం చాలాప్రమాదకరం అన్న విషయం గుర్తించాలి. సమాజం సుసంపన్నమౌతున్నది. కాని భావదారిద్ర్యం కొందరిని వెంటాడుతున్నది. పెరుగుతున్న సంపద కొందరు వ్యక్తులు, సంస్థల గుప్పిటలోకి చేరిపోతున్నది. విజ్ఞానం పెరిగినప్పటికి కొందరిలో వికాసం పెరగడం లేదు. సమాజం వల్ల బాగుపడుతున్న కొందరు సామాజిక స్పృహ లేకుండా సమాజానికి ద్రోహం చేస్తున్నారు. రాజకీయ పార్టీలు, మీడియా సంస్థలు తమ ఉద్దేశాలు విస్మరించి వ్యవహరిస్తున్నాయి. దీనివల్ల అన్ని వ్యవస్థలు పతనం వైపు పయనించడం ప్రారంభం అయ్యింది. ఈ దశలో ప్రతివ్యక్తి ఒకసారి తనను తాను విశ్లేషించుకుని, సమాజాన్ని పరిశీలించి పరిష్కారం వైపు అడుగులు వేయాలి. మానసిక, శారీరక, సామాజిక సమతుల్యతపై దృష్టిపెట్టాలి. సమాజానికి రక్షాకవచాలు అయిన మానవత్వం, విలువలు, ధర్మాలు, సంస్కృతిని కాపాడుకోవాలి. సమాజచైతన్యం వికాసం కోసం తమవంతు కృషి చేయాలి. మొదట వ్యక్తి వికాసం చెందాలి. అధికశాతం శారీరక సామర్థ్యం కోల్పోతున్నారు. సాఫ్ట్‌వేర్ రంగం అభివృద్ధి అయిన తరువాత సంపాదన మెరుగుపడింది. లక్షల జీతాలు పొందే ఉద్యోగాలు వచ్చాయి. కార్లు, మేడలు, సౌకర్యాలు సమకూరాయి. అయితే శారీరక శ్రమలేకపోవడం వల్ల చిన్న వయసులోనే వృద్ధాప్య రుగ్మతలు అయిన మధుమేహం, రక్తపోటు, కీళ్లు, కాళ్లనొప్పులు, నీరసం, ఆయాసం, నిస్సత్తువ ఆవహిస్తున్నాయి. రోజురోజుకు స్థూలకాయం బాధితులు పెరిగిపోతున్నారు. పెళ్లిళ్లు అయినా పిల్లలు పుట్టడం లేదు. కొందరు దాంపత్యజీవితాన్ని సజావుగా గడపలేకపోతున్నారు. ప్రకృతి సిద్ధమైన ధర్మాలు నిర్వర్తించడానికి కూడా వైద్యులు, ఇతర నిపుణుల మీద ఆధారపడవలసి వస్తున్నది. సాఫ్ట్‌వేరుతోపాటు హార్డ్‌వేరు కూడా ముఖ్యమన్న విషయం ప్రతివారు గుర్తించాలి. మంచి అలవాట్లు, అభిరుచులు నేర్వాలి. వ్యక్తులు కూడా కొంత స్పృహకలిగి బ్రతికినంతకాలం ఆరోగ్యంగా ఉండేందుకు ప్రయత్నించాలి. జ్ఞానం, నైపుణ్యాలు, సంపద, సౌకర్యాలను సానుకూలంగా ఉపయోగించుకునే నేర్పునే వికాసం అంటారని గ్రహించాలి. అలాంటి వికాసం పొందితే అకాలమరణాలు, రుగ్మతలు, అనారోగ్యం దరిచేరదని గుర్తించాలి.

## విలువలు పాటించాలి

సమాజం వ్యక్తి మనుగడకు మూలం. కుటుంబం, సమాజం లేకపోతే మనిషి కూడా జంతువులు, పశువులు, పక్షులు ఇతర ప్రాణుల్లాగా భద్రత లేని జీవితాలు గడపవలసి వచ్చేది. సామాజిక విలువలు, ధర్మాలు, వ్యవస్థలు, ఆచారాలు, చట్టాలు మన శరీరంలో కీలకమైన గుండె, ఊపిరితిత్తులు, కిడ్నీలు ఇతర అవయవాల వంటివి. శారీరక ఆరోగ్యం కోసం ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటామో అలాగే సమాజపరిరక్షణ కోసం విలువలు



పాటించాలి.

కుటుంబ విలువ ఇచ్చే

పిల్లలు, తల్లిదండ్రులను ప్రేమించేవారు అపరిపక్వ ప్రేమల్లో పడరు. ఉద్వేగలోపాలతో చెలరేగి యాసిడ్‌దాడులు, ఆత్మహత్యలకు పాల్పడరు. సహనం అలవర్చుకున్న వారు ఆత్రుత, ఆందోళన, మానసిక ఒత్తిడి బారినపడరు. నిజాయితీ, నిరాడంబరత ఉన్నవారిలో అసంతృప్తి అసహనం, అసంకల్పిత ప్రతీకార చర్యలు చెలరేగవు. నీతి, నిజాయితీ, నిబద్ధత, నియమాలు పాటించే వారిలో అసంకల్పితంగా స్థితప్రజ్ఞత అభివృద్ధి చెందుతుంది. ఓటమిని తట్టుకున్న వారిని ఎప్పుడో ఒకప్పుడు గెలుపు వరిస్తుంది. కాబట్టి ఆధునిక సమాజంలో ఎదురయ్యే సవాళ్లపట్ల ప్రతివారు అవగాహన పెంచుకోవాలి. దాంపత్య, కుటుంబ వ్యవస్థలను పరిపుష్టం చేసుకోవాలి. మానవ సంబంధాలను మెరుగుపరచుకోవాలి. ప్రతివారు వ్యక్తిగా వికసించాలి. విజయం సాధించాలి, సమాజాన్ని రక్షించాలి.





కథ

# విలువైన బహుమతి

**చర్లపల్లిలో** ఉండే చంద్రయ్య దగ్గర ఒక ఒంటె ఉంది. ఆ ఒంటె మీద పిల్లలను ఎక్కించుకుని అటూఇటూ కొంతదూరం తిప్పేవాడు. అందుకుగాను ఒకరికి పదిరూపాయలు చొప్పున డబ్బు తీసుకునేవాడు. ఎవరైనా డబ్బు తక్కువ ఉంది అంటే ఇచ్చినకాడికి పుచ్చుకునేవాడు. డబ్బు ఇవ్వలేని పేదపిల్లలు ఒంటెను ఎక్కి తిరగాలని ఉబలాటపడితే వారిని ఉచితంగా తిప్పేవాడు. చంద్రయ్య వలసజీవి. ఆగ్రామంలో తన ఇంట్లో కొన్ని రోజులు మాత్రమే ఉండేవాడు. మిగిలిన రోజులు భార్యా, ఇద్దరు పిల్లలతో గ్రామాలు, పట్టణాలు తిరిగి ఒంటె మీద పిల్లలను తిప్పుతూ సంపాదించుకునేవాడు.

ఒకసారి భువనగిరి అనే ఊరికి వెళ్లాడు. ఊరి వెలుపల సత్రం వద్ద ఒంటెను నిలిపాడు. ఒంటెపై నుండి తన పిల్లలను, వంట కోసం తెచ్చుకున్న సామాగ్రినీ దింపాడు. ఒంటెను చెట్టుకింద తాడుతో కట్టి, మేత తెచ్చి వేశాడు. ఆసత్రంలో భార్యా, పిల్లలతో బస చేశాడు. ఉదయమే ఒంటెను తీసుకుని గ్రామంలోకి వెళ్లాడు. పిల్లలను ఒంటెమీద తిప్పడానికి చాలామంది తల్లిదండ్రులు ఆసక్తి కనపరిచారు. మధ్యాహ్నం వరకూ తిప్పి, భోజనం వేళకు సత్రం వద్దకు చేరుకున్నాడు. ఒంటెను తాడుతో చెట్టుకు కట్టాడు. ఒంటె మీద పిల్లలు కూర్చోవడానికి వీలుగా మెత్తని గుడ్డలతో ఏర్పాటు చేసిన పీఠాన్ని కిందకు తీశాడు. ఆ గుడ్డలకు అతుక్కుని తళతళ మెరిసిపోతూ ఒక బంగారు హారం కనిపించింది. హారానికి విలువైన పతకం అమర్చబడి ఉంది. హారాన్ని భార్యకు చూపించాడు.

'ఖరీదైన ఈ హారం ఎవరితో ధనవంతుల బిడ్డదిలా ఉంది. ఒంటెమీద తిప్పేటప్పుడు జారిపోయిపడినట్లుంది' అంది ఆమె. 'ఈ హారాన్ని పోగొట్టుకున్న వారికివ్వాలంటే ఎవరిదో ఎలా తెలుస్తుంది?' అన్నాడు చంద్రయ్య.

'నీ దగ్గర భద్రపరచుకో, సాయంత్రం ఊరిలోకి వెళ్లినప్పుడు హారం పోయింది. నీకు దొరికిందా? అని ఎవరైనా అడిగితే వారికి ఇవ్వు' అని చెప్పింది భార్య. హారాన్ని తనవద్ద భద్రపరచుకున్నాడు చంద్రయ్య. సాయంత్రం ఒంటెతో ఉదయం వెళ్లిన వీధిలోకిపోయాడు.

చంద్రయ్య దగ్గరకు ఒక మనిషి వచ్చి 'మా యజమాని కూతురుని ఉదయం నీ ఒంటెమీద తిప్పావు. ఈరోజు పాప పుట్టినరోజు కాబట్టి మెడలో విలువైన హారం వేశారు. హారం కనిపించడం లేదు. దారిపోడవునా వెదికి చూశాం. కనిపించలేదు. నీకు మా వీధిలో ఎక్కడైనా దొరికిందా?' మా యజమాని రంగనాథంగారు అడిగిరమ్మన్నారు' అన్నాడు ఆ మనిషి. చంద్రయ్య జరిగిన విషయం చెప్పి, హారం రూపురేఖలు అడిగి వారిదేయని నిర్ణయించుకుని తీసి చూపించాడు.

'నీవే వచ్చి మా యజమానికివ్వు' అని ఆ మనిషి చంద్రయ్యను తన యజమాని వద్దకు తీసుకెళ్లాడు. చంద్రయ్య హారాన్ని ఆయనకిచ్చాడు. చంద్రయ్య నిజాయితీకి రంగనాథంగారు ఆశ్చర్యపోయారు. 'హారాన్ని చూడలేదని ఒక అబద్ధం నీవు చెప్పి ఉంటే, ఈ హారం నీ సొంతమయ్యేది. ఈహారం చాలా విలువైనది, కానీ నీ నిజాయితీ ఈ హారం కంటే విలువైనది. వెలకట్టలేనిది. నీకు బహుమతిగా ఏంకావాలో అడుగు. ఇస్తాను' అన్నారు రంగనాథం. 'మీ హారం మీకిచ్చినందుకు బహుమతి ఎందుకయ్యా?' అన్నాడు చంద్రయ్య. 'నీతోపాటు ఎవరెవరు ఉంటారు?' అడిగారు రంగనాథం. 'నా భార్య, ఇద్దరు పిల్లలు ఉంటారయ్యా!' చెప్పాడు చంద్రయ్య. 'నీ పిల్లలకు అమూల్యమైన ఒక బహుమతి ఇవ్వాలనుకుంటున్నాను.పట్నంలో నాపిల్లలు చదివే పాఠశాలలో నీపిల్లలనూ ఉంచి చదివిస్తాను. వసతి భోజనం అక్కడే. నీవు, నీ భార్యా వెళ్లాలనుకున్నప్పుడు చూసి రావచ్చు. నీ పిల్లలు నీలా కాకుండా ఉన్నత చదువులు చదవాలి. ఆ బాధ్యత నేను తీసుకుంటున్నాను. చదువు అనే విలువైన బహుమతిని నీ పిల్లలకు అందిస్తాను' అన్నాడు రంగనాథం. ఆయన మంచి హృదయానికి చంద్రయ్య కళ్లలో ఆనందభాష్పాలు తిరిగాయి. చేతులెత్తి నమస్కరించాడు చంద్రయ్య.

**- డి.కె.చదువులబాబు**







# చిన్నారుల ప్రపంచం

వార్త ఆదివారం

## బాలగేయం

### చెల్లి రావమ్మ..



చెల్లిచెల్లి రావమ్మ
చక్కగ ముస్తాబవమ్మ
అక్కాఅక్కా వస్తున్నా
చక్కగ ముస్తాబవుతున్నా
చెల్లిచెల్లి రావమ్మ
చక్కగ బడికి వెళ్దాం
అక్కాఅక్కా వస్తున్నా
చక్కగ బడికి వస్తున్నా
చెల్లిచెల్లి రావమ్మ
చక్కగ చదువుకుందాం
అక్కాఅక్కా వస్తున్నా
చక్కగ చదువుకుందాం
చెల్లిచెల్లి రావమ్మ
చక్కగ ఆడుకుందాం
అక్కాఅక్కా వస్తున్నా
చక్కగా ఆడుకుందాం.

**- చాడా మునిశేఖర్‌రెడ్డి**

## హలో ఫ్రెండ్...

చిన్నారుల ప్రశ్నలకు

వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్

## గిరీష్ అంకుల్ సమాధానాలు

**- కె.క్రాంతికిరణ్,** నాగార్జునసాగర్

**ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. విమానపు ప్రొపెల్లర్‌లు ఏవిధంగా పనిచేస్తాయి?**

**జవాబు: క్రాంతికిరణ్!** విమానం గాలిలో ముందుకు దూసుకుపోవడానికి ప్రొపెల్లర్స్ సహకరిస్తాయి. అంటే ఈ ప్రొపెల్లర్‌లకు ఉండే బ్లేడ్‌లు ఎదురుగా వస్తున్న గాలిని చీల్చుకుంటూ ఎంతో శక్తిమంతమైన వేగంతో దానిని వెనక్కి నెట్టి వేస్తాయి. అప్పుడాగాలి ప్రొపెల్లర్స్‌ను ముందు వైపుకి నెడుతుంది. న్యూటన్ గతి సూత్రం యాక్షన్ అండ్ రియాక్షన్(చర్య-ప్రతిచర్య) సిద్ధాంతం ప్రకారం విమానం ముందు వైపుకు చూసుకువెళుతుంది. ప్రతి ఒక్క చర్యకు సమాన ప్రతిపత్తిలో ప్రతిచర్య అనేది ఉంటుందన్న సిద్ధాంతరీత్యా ఈ రెండు చర్యలూ వ్యతిరేకంగా కూడా ఉంటాయి.

**- ఎస్.అభీర,** విజయవాడ

**ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. మైక్రోస్కోప్ వల్ల ఉపయోగాలు ఏంటి?**

**జవాబు: అభీర!** సాధారణంగా మన కంటిచూపుకు అందని సూక్ష్మస్థాయి వస్తువులు, జీవులను పెద్ద ఆకారంలో చేసి చూసేందుకు మైక్రోస్కోప్‌ను ఉపయోగిస్తారు. మైక్రోస్కోప్ ద్వారా వైరస్, బ్యాక్టీరియా మొదలైన జాతుల సూక్ష్మజీవాలను సైతం స్పష్టంగా పరిశీలించవచ్చు. మైక్రోస్కోప్‌కు గల లెన్స్ ద్వారా ఇది సాధ్యపడుతుంది. ఈ సూక్ష్మాతి సూక్ష్మ జీవాలు వాటి అసలైన ఆకారం కన్నా దాదాపు వంద రెట్లు పెద్దవిగా చూపించే మైక్రోస్కోప్‌లు ఉన్నాయి. కొన్ని పెద్దవి అయితే 2,500 రెట్టు పెద్దవిగా ఆ సూక్ష్మజీవులను కనిపింపచేస్తాయి. మైక్రోస్కోప్‌లలో అతి శక్తివంతమైన ఎలక్ట్రానిక్ మైక్రోస్కోప్‌ల ద్వారా సూక్ష్మజీవులను 20 లక్షల రెట్లు పెద్దవిగా చూడటానికి అవకాశం వుంది. ఏంటన్‌వోన్ ల్యూవెన్ హాక్ అనే శాస్త్రవేత్త వీటి ప్రాథమిక స్వరూపాన్ని ఆవిష్కరించారు.



'మెరిసేదంతా బంగారం కాదన్లే' నిగనిగలాడుతూ నోరూరించే పండ్లన్నీ తినడానికి పనికిరావని ప్రజలు గమనించాల్సిన రోజులివి. ప్రపంచమంతా కల్తీతో నిండిపోయింది. తాను బాగుపడితే చాలు, మిగతావారు నాశనమైపోయినా పర్లేదనే ఆలోచన సమాజాన్ని కృంగదీస్తుంది.

# కల్తీలతో రోగాలు!





బియ్యం పిండికి రంగు కలిపితే అది పసుపు..పాలపొడిలో నీళ్లు కలిపితే చిక్కటిపాలు. అరటికాడ గుజ్జుతో అల్లం వెల్లుల్లి పేస్టు, రసాయనాలు రుద్దితే నిగనిగలాడే పండ్లు, నాణ్యతలేని నూనెతో బియ్యానీ, నూడుల్స్, నాన్‌వెజ్ వేపుళ్లు, ఇలా చెప్పుకుంటూపోతే 'కల్తీ కలర్' పూసుకున్న తినుబండారాలను నోరూరించుకుంటూ తింటున్నాం. ఆరోగ్యాన్ని సంరక్షించేందుకు అవసరమవుతున్న పండ్లకు సైతం ప్రమాదకర రసాయనాలను రుద్దుతున్నారు. కుంకుమ, నూనెలు, పప్పులు, చక్కెర, బియ్యం, ఇతర సరుకులను కల్తీ చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. సౌందర్యపోషణకు వాడే ప్రముఖ ఫేస్‌క్రీమ్‌లకు సంబంధించి నకిలీల దందా మార్కెట్లో నిరాటంకంగా సాగుతోంది. దేశవ్యాప్తంగా దుకాణాల్లో అమ్ముడవుతున్న నకిలీ ఫేస్‌క్రీమ్‌లను గుర్తించడం కష్టసాధ్యమే. పప్పులు, పండ్లు, కూరలే కాదు. ఇప్పుడు మార్కెట్‌లో కల్తీకాని సరకులే కనిపించడం లేదు. నెయ్యి, నూనెలు, సౌందర్య ఉత్పత్తులు, సుగంధ ద్రవ్యాలు, మిఠాయిలు, శీతల పానీయాలు, పచ్చళ్లు, పాలు,నీళ్లు..ఇలా ఏది చూసినా కల్తీమయమే. కల్తీలు, నకిలీల నివారణకు పలు ప్రభుత్వ శాఖలున్నా అక్రమ వ్యాపారాలకు తెరపడడం లేదు. ఎంత సంపాదించినా తిండి విషయంలో రాజీ పడితే బతుకుబండి సాగదు గనుక నాణ్యమైన పండ్లు, కూరలు, నూనెలు, బియ్యం, ఇతర పదార్థాలు కొనాలని అందరూ భావిస్తారు. ఈ భావనే కల్తీ వ్యాపారులకు బలంగా మారుతోంది. అధిక లాభాలకు ఆశపడి ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే రసాయనాలు, నాసిరకం వస్తువులు కలిపి కొందరు వ్యాపారులు జేబులు నింపుకుంటున్నారు. సాధారణ ప్రజలే కాదు చదువుకున్న వారు సైతం ఆహార పదార్థాల్లో కల్తీ జరిగిన విషయాన్ని గుర్తించలేకపోతున్నారు. ఒకప్పుడు మామాడి పండ్లను మగ్గించేందుకు మాత్రమే కార్బయిడ్ వంటి విషపూరిత రసాయనాలు వినియోగించేవారు. ఇప్పుడు అన్ని రకాల పండ్లను రసాయనాలతో కృత్రిమంగా మగ్గించి విక్రయిస్తున్నారు. దీంతో ఏ పండ్లను కొనాలన్నా జనం భయపడే పరిస్థితి నెలకొంది. దీర్ఘకాలంగా కల్తీ ఆహార పదార్థాలను తినడం, పానీయాలను సేవించడం వల్ల ఆరోగ్యం దెబ్బతినడం ఖాయం. కల్తీ ఆహార పదార్థాలు, పండ్లను తినడం వల్ల కేన్సర్లు, ఉదరకోశ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. మహిళల్లో గర్భస్రావాలు, పిల్లల్లో ఎదుగుదల లోపించడం, వృద్ధుల్లో నిద్రలేమి, అలసట వంటి అనారోగ్యాలు అనివార్యమవుతాయి. జీవన ప్రమాణాలపై కూడా కల్తీ ప్రభావం పడుతఉందని నిపుణులు హెచ్చరిస్తూనే ఉన్నారు. జంతు కళేబరాలతో వంట నూనెలు, యూరియా వంటి రసాయనాలతో పాలు, హానికారక పదార్థాలతో నెయ్యి, కృత్రిమంగా మగ్గబెట్టిన పండ్లు ఇలా కల్తీ

**తరిగొప్పుల విఎల్లెన్ మూర్తి**

సర్వాంతరామి అయిపోయింది. వంటల్లో ఘాటైన వాసన కోసం, మంచి రుచి కోసం మిరియాలు, గసగసాలు, జీలకర్ర, పసుపు, లవంగాలు, యాలకులు, ఇతర సుగంధ ద్రవ్యాలను వాడుతుంటాం. వీటిలో కల్తీ జరుగుతున్నా కనిపెట్టలేని పరిస్థితి నెలకొంది. ఎండబెట్టిన బొప్పాయి విత్తనాలను మిరాయల్లోను, జీలకర్రలో 'సోంపు'ను కలుపుతున్నారు. బొప్పాయి గింజలు మిరియాల్లో కనిపించేందుకు బ్లాక్ ఆక్సైడ్‌ను



కలిపి ఎండలో ఆరబెడతారు. పసుపులో తవుడు, టీపొడిలో రంపపు పొట్టు, కారంలో చౌకరకం పొడర్లు కలుపుతున్నారు. మంచి గిరాకీ ఉంటుంది గనుక యాలకులు, మిరియాలు, గసగసాలు, జీలకర్రకు సంబంధించి భారీగా కల్తీ జరుగుతోంది. వీటి విక్రయాల్లో లాభాలు కూడా కళ్లు చెదిరేలా ఉంటాయి. మిరియాలు, ఆకర్షణీయంగా కనబడేలా వాటిపై హానికారక నూనెలను 'స్ప్రే' చేస్తుంటారు. కల్తీ సుగంధ ద్రవ్యాలు హోల్‌సేల్ మార్కెట్లలో ప్రతిరోజూ వందలు, వేలకిలోల్లో అమ్ముడవుతాయి. రసాయనాలతో మామిడి పండ్లను రాత్రికి కృత్రిమంగా మగ్గపెడుతున్నారని తెలిసి జనం వాటి జోలికి వెళ్లడం తగ్గించుకున్నారు. అయితే, ఇప్పుడు అన్ని రకాల పండ్లను, కూరగాయలను కాల్షియం కార్బైడ్ వంటి రసాయనాలతో తెల్లారేసరికి మగ్గబెడుతూ మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. పుచ్చకాయలు, అరటి, సపోటా, ఆరంజ్, ఆపిల్ ఇలా అన్ని రకాల పండ్లు ఆకర్షణీయంగా కనిపించేందుకు పలురకాల రంగులు, జిగురు యథేచ్ఛగా వాడుతున్నారు. ఈ పండ్లు పైకి నిగనిగలాడుతున్నా లోపల అంతా పచ్చిపచ్చిగా ఉంటుంది. రుచి సంగతి దేవుడెరుగు, విషపూరిత రసాయనాల ప్రభావంతో మన ఆరోగ్యవ్యవస్థ దెబ్బతినడం ఖాయం. నాసిరకం జ్యూస్ తాగడం వల్ల కడుపునొప్పి, కాలేయ సమస్యలు, జీర్ణవ్యవస్థకు ఆటంకం వంటివి తప్పవని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. పండ్లపై వాడే రసాయనాల ఫలితంగా తలనొప్పి,



నిద్రలేమి, బద్దకం, కిడ్నీ సమస్యలు తలెత్తుతున్నాయి. పలు రకాల పండ్లే కాదు, టమాటా, కేరట్ వంటి కూరగాయలూ రసాయనాల బారిన పడుతున్నాయి. నిత్యావసర సరకులే కాదు. కల్తీ ఆహారపదార్థాల వల్ల రోగాల బారిన పడుతూ ప్రపంచవ్యాప్తంగా ఏటా 2.2మిలియన్ల మంది మరణిస్తున్నారని, వీరిలో చిన్న పిల్లల సంఖ్య అధికంగా ఉంటోందని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) ఇదివరకే తీవ్రస్థాయిలో ఆందోళన వ్యక్తం చేసింది. క్షేమకరం కాని ఆహార పదార్థాలతో పలురకాల బ్యాక్టీరియా, వైరస్‌లు, పరాన్న జీవులు, విషపూరిత రసాయనాలు మన శరీరాల్లోకి చేరుతున్నాయి. కల్తీ ఆహారం ఫలితంగా డయేరియా, కేన్సర్లు వంటి 200 రకాల వ్యాధులు విజృంభడంతో ప్రజారోగ్య వ్యవస్థ దారుణంగా దెబ్బతింటోంది. వైరస్‌లు, రసాయనాల ప్రభావం లేనివిధంగా నాణ్యమైన ఆహార పదార్థాలు అందేలా 'ఆహారభద్రత' నినాదాన్ని పాటించాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ పిలుపునిచ్చింది. ఈ లక్ష్యం నెరవేరేలా ప్రభుత్వాలు, పౌర సమాజాలు, స్వచ్ఛంద సంస్థలు చొరవ చూపాలని డబ్ల్యూహెచ్ఓ సూచించింది. ఆహార పదార్థాల ఉత్పత్తి, నిల్వ, సరఫరా, విక్రయం అనే విషయాలు అత్యంత కీలకమైనవని, ఏ స్థాయిలోనూ కల్తీకి ఆస్కారం లేకుండా చర్యలు తీసుకుంటే ప్రజారోగ్య వ్యవస్థకు విఘాతం కలగదని ప్రపంచ ఆరోగ్యసంస్థ నిపుణులు కొన్ని సూచనలు చేశారు. రసాయనిక ఎరువులు, క్రిమి సంహారక మందుల ప్రభావం లేకుండా వ్యవసాయోత్పత్తులను విక్రయించాలి. ప్యాకేజీ ఫుడ్ తయారీ, నిల్వలో ప్రమాణాలు పాటించాలి.



వినియోగదారులు కూడా వీటి పట్ల అవగాహన కలిగి ఉండాలి. శుభ్రత, నాణ్యత ప్రాతిపదికగా ఆహార పదార్థాలనుకొనుగోలు చేయాలి. ఒకప్పుడు పాలల్లో నీళ్లు కలిపితే కల్తీ జరిగిందని వాపోయేవారు. ఇప్పుడు పాలల్లో నీళ్లకు బదులు ప్రమాదకర రసాయనాలు కలుపుతున్నారు. సింథటిక్ పాలు అలాంటివే. కనుక వినియోగదారులు జాగ్రత్తగా లేకపోతే మోసపోవడం, రోగాలపాలవడం ఖాయం. మోసగించేవాళ్లు ఎప్పుడూ ఉంటారు. మోసపోకుండా ఉండటం వినియోగదారుడి తెలివిపై ఆధారపడి ఉంటుంది. కలియుగంలో కల్తీలేని పదార్థాలు దొరకడం కష్టం. వినియోగదారుడే తెలివిగా వ్యవహరించి కల్తీలేని సరుకులు కొనుక్కోవాలి. తినే ఆహారం కల్తీ వస్తువులతో తయారైనదేతై చేజేతులా మన ఆరోగ్యాన్ని పాడుచేసుకున్న వాళ్లమవుతాం.

**పాలు:** డిటర్జెంట్‌పౌడర్, యూరియా, సింథటిక్ మిల్క్‌తో కల్తీ చేస్తారు. కొద్దిపాలలో అంతే మొత్తం నీళ్లు కలిపితే డిటర్జంట్ కలిపిన విషయం తెలిసిపోతుంది. పాలను వెచ్చపెడితే పసుపువర్ణంలోకి మారినా, తాగినప్పుడు చేదుగా ఉన్నా అవి సింథటిక్ పాలకల్తీ జరిగినవని తెలుసుకోవచ్చు. కల్తీపాలు తాగితే జీర్ణవ్యవస్థ దెబ్బతింటుంది. కేన్సరుకు దారితీయొచ్చు.

**తేనె:** పంచదార, బెల్లంపాకం కలిపి కల్తీ చేస్తారు. పట్టుపేకలపై తేనె వేస్తే అంటుకోకుండా జారిపోతే అది అసలు తేనే. అంటుకుంటే అది కల్తీ జరిగినట్టే. తేనెలో ముంచిన అగ్గిపుల్లను వెలిగిస్తే వెంటనే మండితే అది అసలు తేనె. కల్తీది అయితే ఆ పుల్ల వెలగదు లేదా చిన్నచిన్న శబ్దాలతో ఆరి వెలుగుతుంది. తేనె కల్తీ అజీర్తి సమస్య రావొచ్చు. గ్లూకోజ్ పరిమాణం అమాంతం పెరిగి మధుమేహ బాధితులకు సమస్యగా మారుతుంది.

**ఐస్‌క్రీమ్:** పిల్లలు, కుర్రకారు ఎక్కువగా ఇష్టపడే ఐస్‌క్రీమ్‌లోనూ కల్తీ జరుగుతోంది. వాషింగ్ పౌడర్‌ను ఇందులో కల్తీ చేస్తుంటారు. అనుమానం వస్తే కొద్దిగా ఐస్‌క్రీమ్‌పై నిమ్మరసం పిండండి. నురగ, బుడగలు వస్తే అది కల్తీ జరిగినట్టే. కల్తీ ఐస్‌క్రీములు తింటే ఉదయ, కాలేయ సంబంధిత సమస్యలు వస్తాయి.

**టీపొడి:** చక్కటి రంగుకోసం బొగ్గు, తారుతో కూడిన రంగులు వాడతారు. తెల్లటి బ్లాటింగ్ పేపర్‌పై టీపొడి జల్లి ఐదు నిమిషాల తరువాత చూస్తే వాటిపై రంగు మచ్చలు ఏర్పడితే అది కల్తీ జరిగినట్లే. నిషేధిత రంగులు వాడిన పొడిన ఉపయోగిస్తే కేన్సర్ రావొచ్చు. ఉప్పులోనూ సాధారణ ఉప్పులో సుద్దపొడి, అయొడైజ్డ్ ఉప్పులో సాధారణ ఉప్పు కల్తీ చేస్తారు. ఉప్పు కలిపిన నీళ్లను వేడిచేస్తే సుద్దపొడి పైకి తేలిపోతుంది. ఆ దుంపపై నీలిమచ్చలు ఏర్పడితే అది కల్తీ జరగనట్లు లెక్క. ❑

కథ

# సారీ.. టైం లేదు

మంజీత కుమార్

“ఏవండీ! కాస్త ఆ జాడీని పై నుంచి తీసిస్తారా?” లేచిన దగ్గరి నుంచి ఫోన్లో మునిగిన భర్త బృందావన్‌ను అడిగింది రాధిక.

“ఆ.. ఐదు నిమిషాలు” అంటూ మొబైల్ నుంచి తల ఎత్తనే లేదు.

“ఇలా ఇప్పటికి పదిసార్లు చెప్పారు, అరే ఒక్క నిమిషం పని అంతే. అయినా తమరు అంత ముఖ్యమైన పని ఏం చేస్తున్నారో” ప్రశ్నించింది.

“నాకు మొన్న అవార్డు ఇచ్చారు కదా, ఆ పోస్ట్ సోషల్ మీడియాలో పెట్టాను. కనీసం ఒక్కరంటే ఒక్కరు కూడా అభినందనలు చెప్పనే లేదు” ఆశ్చర్యంగా అన్నాడు.

“అయినా మనం పెట్టే ప్రతి పోస్టుకు లైకులు, కామెంట్లు రావాలనుకోవడం మనదే తప్పు. ఒక్క మాట చెప్పండి.. ఆ పోస్టులన్నీ మీ కోసం పెట్టుకుంటున్నారా లేక దండోరా వేయడానికా?” భార్య నిలదీసింది.

“నీలాంటి రచయిత్రిని పెళ్లి చేసుకున్నా చూడు.. నాదే తప్పు” భార్య వైపు కోపంగా చూస్తూ అన్నాడు.

“తమరు మాత్రం కాదా ఏంటి? అటు కథలు, ఇటు కవితలు... అబ్బో! పూటకో పురస్కారం, ఆర్నెల్లకో అవార్డు” మనసులోని గర్వాన్ని మాటల్లో పలికించింది.

“నువ్వు ఎన్నన్నా చెప్పు.. మనం ‘నా’ అనుకున్నవారు మెచ్చుకుంటే ఆ ఆనందమే వేరు. అయినా ఈ రోజుల్లో అలాంటి స్వచ్ఛమైన మెచ్చుకోళ్లు, ప్రేమలు ఎక్కడున్నాయి? బిజీ అన్న ముసుగులో అందరూ ఫోన్లు పట్టుకుని తమలో తామే మునిగిపోతుంటే” కాస్త బాధగా చెప్పాడు.

“మధ్యలో ఫోన్లు మాత్రం ఏం చేశాయండీ! జనమంతా సోషల్ మీడియాకు బానిసైపోతే ఎవరేం చేయగలరు?” భర్త మాటను కొట్టిపారేస్తూ అంది.

“అరే.. ఓ కథో, కవితో పోస్టు చేశామనుకో.. ఒక్కరంటే ఒక్కరు కూడా భేష్ అని మెచ్చుకోరు. మీరు నన్ను పొగిడితే నేను నిన్ను పొగుడుతా అన్నట్టు తయారయ్యారు అందరూ. సోషల్ మీడియాలో ఈ పిచ్చి బాగా ముదిరింది. నా పోస్టుకు నువ్వు లైక్ కామెంట్ చేయకపోతే నీ పోస్టుకు నేనెందుకు చేయాలి? అన్న తిక్క. ఒకవేళ ప్రశంసిస్తే ఏమన్నా ఆస్తులు కరిగిపోతాయా? అంతస్తులు కూలిపోతాయా? స్పందన అన్నది అవసరం, అది లేకుంటే కష్టం” అంటూ బాధను వెళ్లగక్కసాగాడు.



“ఏమన్నా అంటే సారీ.. టైం లేదు అంటారు. అసలు ఎవరి దగ్గర టైముంది? గతంలో 24 గంటలే.. ఇప్పుడూ 24 గంటలే. అప్పటికీ ఇప్పటికీ తేడా ఏమిటి.. మనుషులు మారారా లేక సమయం తగ్గిపోయిందా? ఉద్యోగాలు చేస్తున్నవారు, చేయనివారు, పెద్దలు, పిల్లలు.. అందరూ బిజీనే. ఎవ్వరి దగ్గర సమయం లేదు. మరి సమయం ఎక్కడికి పోతోంది. ఎవరు వినియోగించుకుంటున్నారు.. నాకైతే అర్థమే కావట్లేదు” అంటూ కుర్చీలో కూర్చుండిపోయాడు.

భర్తకు కాఫీ ఇచ్చి తానూ పక్కనే కూర్చుంది “మీకు లైకులు, కామెంట్లు వస్తేనే సంతోషమా.. లేకుంటే కాదా?” అని అడిగింది.

“నిజానికి నా బాధ అందుకు కాదు. అసలు మనుషులు ఎందుకిలా మారారు అని. కొందరు మంచి మంచి కథలను, కవితలను పోస్టు చేస్తుంటారు. ఎంత లేదన్నా ఓ ఐదారుగురు చదువుతారు కదా. కానీ ఒక్కరంటే ఒక్కరు కూడా బాగుందని కామెంట్ చేయరు. అలాగని ఆ కథలు, కవితలు బాగా ఉండవా అంటే బ్రహ్మాండంగా ఉంటాయి. మరి ఆ ముక్క చెప్పడానికి మొహమాటమా లేక ఒళ్లు బద్ధకమా” కాఫీ కప్పును ఖాళీ చేసి టేబుల్‌పై పెట్టేశారు.

“సరేలెండి.. మీ ఆవేశం ఇప్పుడిప్పుడే చల్లారేలా లేదు. నాకు వంటపనుంది.. వెళుతున్నా లోపలికి” అంటూ లోపలికి వెళ్లిపోయింది.

బృందావన్, రాధికలు ఇద్దరూ రచయితలే. ప్రేమించి, పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకున్నారు. వారికి ఇద్దరు పిల్లలు. మంచి ఉద్యోగాలు చేస్తూ ఒకరు ఢిల్లీలో మరొకరు బెంగళూరులో ఉంటున్నారు. ప్రస్తుతం వీరిద్దరే ఇంట్లో ఉంటూ రచనలు చేస్తూ సమాజంలో వస్తున్న మార్పులను గమనిస్తూ అప్పుడప్పుడు గంటల తరబడి చర్చించుకుంటూ ఉంటుంటారు. వీలున్నప్పుడల్లా సాహితీ మిత్రులు వస్తూ వీరిని పలకరించి వెళుతుంటారు. అలా ఓ రోజు వీరిద్దరూ టీ తాగుతూ మాట్లాడు కుంటుండగా ప్రముఖ రచయిత సుబ్రమణ్యేశ్వర్ వీరి ఇంటికి వచ్చారు.

"రండి.. రండి ఎన్నాళ్లకెన్నాళ్లకు.. ఎలా గుర్తొచ్చాం?" అంటూ ఆయనకు టీ అందించింది రాధిక. "చాలా రోజులయ్యిందనే కలసిపోదామని వచ్చాను. ఇదిగో.. నా కొత్త పుస్తకం మీకు స్వయంగా ఇద్దామని" అంటూ ఓ పుస్తకాన్ని చేతికి అందించారు.

"ఓహ్.. అభినందనలు.. మొత్తానికి మీ కోరిక తీరినట్టే కదా" అంటూ బృందావన్, సుబ్రమణ్యేశ్వర్‌తో అన్నారు.

"మీకు తెలుసు అనే అనుకుంటున్నాను... పుస్తక ముద్రణ భారం ఎంత పెరిగిందో. సరే ఆ విషయాన్ని పక్కన బెడితే పుస్తకాలు కొని చదివేవారి సంఖ్య ఎంత తగ్గిందో. ఎవర్ని చూసినా పిడిఎఫ్ ఉంటే పంపండి అంటున్నారే తప్ప పుస్తకం కొనే ఊసే ఎత్తట్లేదు. నేనేమో నూటా యాభై పుస్తకాలు అచ్చు వేయించాను. ఇదిగో.. ఇలా మిత్రులకు ఓ ఇరవై కాపీలు పంచేశానా.. మిగిలినవి ఏం చేయాలో అర్థం కావట్లేదు. ఇంట్లో పెట్టాలంటే అద్దె ఇల్లు కదా.. మనుషులకే ఇరుకు. ఏమాత్రం స్థలం లేదు. ఇవన్నీ ఒక ఎత్తయితే పురుగూ పుట్రా పట్టకుండా జాగ్రత్తగా చూసుకోవాలి. మతి పోతోందనుకోండి" అంటూ తన ఆవేదనను బయట పెట్టారు. ఇదంతా విని ఆశ్చర్యపోయారు బృందావన్, రాధికలు.

"అందరూ ఉచితానికి మరిగారన్నమాట. అసలు ఒక రచయిత ఎన్ని పురిటినొప్పులు పడి ఒక పుస్తకాన్ని రాసి అచ్చు వేయిస్తారు, అది వెలకట్టలేని శ్రమ. కనీసం అదన్నా గుర్తించాలి కదా. మీ పరిస్థితి చూస్తే చాలా బాధగా ఉంది" అంటూ రాధిక లోపలికి వెళ్లి ఓ పది పుస్తకాలకు సరిపడా డబ్బులు తెచ్చి ఇచ్చింది.

"మీ రచనలు ఎంత బాగుంటాయో మాకు తెలుసు. ఇలాంటి సాహిత్యం ముందు తరాలకు అందాలి. అందుకు మా వంతు సాయంగా ఓ పది పుస్తకాలు మాకు ఇవ్వండి" అంది.

"అయ్యో తల్లీ, మీకు పుస్తకాలు అమ్మేందుకు రాలేదమ్మా. నాకు డబ్బులు వద్దు" అంటూ ఆయన మొహమాటపడగా బృందావన్ లేచి ఆయన జేబులో డబ్బులు పెట్టేశారు. కాసేపు మంచీ చెడూ మాట్లాడుకుని సెలవంటూ ఆయన వెళ్లిపోయారు.

..........

ఫోన్ మోగింది.

"హలో.. ఆ నేనే. ఏంటి? నేను రెండు వేలు కట్టాలా? వద్దులే బాబు.. నా దగ్గర చాలానే శాలువాలు, కండువాలు ఉన్నాయి. నువ్వే ఉంచుకో" అంటూ ఫోన్ పెట్టేశారు.

"ఎవరండీ?" అడిగింది రాధిక.

"ఏదో సాహితీ సంస్థ అట. నాకు సన్మానం చేయాలని ఫోన్ చేశారు. కాకపోతే రెండు వేలు కట్టాలట. అంటే నా డబ్బులతో నేనే సన్మానం చేసుకోవాలన్నమాట. ఇదెక్కడి చోద్యం" అంటూ విస్తుపోయారు.

"మొన్న నా మిత్రురాలు ఫోన్ చేసింది. ఎన్ని విచిత్రాలు, విడ్డూరాలు చెప్పిందనుకున్నారు. కొన్ని సాహితీ సంస్థలు వాట్సాప్ గ్రూపులు పెట్టి కవులందరినీ ఒకచోట చేర్చి కవితలు రాయిస్తున్నారట. మంచిదే కానీ మరి కొందరు కవితలు రాయించి, అవి ఎలా ఉన్నా కవుల దగ్గరి నుంచి డబ్బులు తీసుకుని పుస్తకంగా అచ్చు వేయిస్తున్నారట. ఎవరు డబ్బులిస్తే వారివి కనీసం కవిత మాదిరి కూడా లేనివి కూడా ప్రచురించి పుస్తకంగా తీసుకు వస్తున్నారట" అంటూ ఆశ్చర్యంగా భర్తకు చెప్పింది.

"ఇప్పుడు సోషల్ మీడియా పుణ్యమాని సాహితీ సంస్థలు ఎక్కువైపోయాయి. తెలుగు భాషను గౌరవిస్తూ నేటి తరం రచయితలు రచనలు చేయడం అభినందనీయం. అలాని ఏది పడితే అది కవిత్వం అయిపోదు. ప్రాసలు కలిస్తే పాటలు అయిపోవు" అన్నాడు బృందావన్.

"ఇవన్నీ ఒక ఎత్తయితే సాహిత్యచోరులు పెరిగిపోయారు. మొన్న నేనో కవిత రాసి పోస్టు చేశానా. నా పేరు ఊరు తీసేసి వేరే ఏదో గ్రూపులో తమ కవిత అన్నట్టు ఎవరో పోస్టు చేశారట. నా స్నేహితుడు చూసి నాకు స్క్రీన్‌షాట్ తీసి పంపించారు. సదరు చోరుడికి మెసేజ్ పెడితే నచ్చింది నా వాల్‌పై పెట్టుకున్నా అన్నాడు.

సరే మంచిది.. కానీ రచయిత పేరు ఎందుకు తీసేసావు అంటే సమాధానం లేదు. ఒకరి సాహిత్యాన్ని మరొకరు తమదంటూ ఎలా ముద్ర వేసుకోగలరు. ఎంత అన్యాయం. గతంలో ఇలాంటివి ఎప్పుడూ ఎక్కడా జరగలేదు" అంటూ బాధపడింది.

"అసలు ఏం జరుగుతోంది.. మనుషులు మరీ ఇంతలా ఎలా మారిపోయారు. ప్రతీచోటా స్వార్థం, నా అన్న అహం, ఒకరి ఎదుగుదలను చూసి మరొకరు ఏడవడం, శత్రుత్వం, లేనిపోని అబాండాలు వేయడం.. ఒకటా రెండా ఎక్కడా ప్రేమ లేదు. అభిమాన పూర్వక మాటలు లేవు. సహృదయంతో చేసే విమర్శలు, సమీక్షలు లేవు.

అందరికీ ప్రశంసలు మాత్రమే కావాలి. అందరూ తమనే పొగడాలనే స్వార్థం పోవాలి" బృందావన్ ఆలోచిస్తూ అన్నాడు.

"అవునండీ, ఎవరో చేస్తారని కాదుగానీ ఇందుకు మనమే పూనుకోవాలి. మనుషుల్లో మార్పు తీసుకురావాలి. మళ్లీ పుస్తకాలకు పూర్వ వైభవం వచ్చేలా చర్యలు తీసుకోవాలి. ఇతరుల రచనలు చదివితేనే మన రచనల స్థాయి తెలుస్తుందని అందరూ గుర్తెరిగేలా చేయాలి. అన్నింటికన్నా ముందుగా మన ఇంటినే ఒక ఉచిత గ్రంథాలయంగా మార్చుదాం. మంచి రచనలను మనమే ప్రోత్సహిద్దాం. ఆర్థికంగా వెనకబడ్డ రచయితలను ఆదుకుందాం. పుస్తక ప్రచురణ భారం కాకుండా, అచ్చు వేసిన పుస్తకాలు కొనుగోలు అయ్యేలా అన్ని ఏర్పాట్లు చేద్దాం.. ఏమంటారు?" అంది.

**"రండి.. రండి ఎన్నాళ్లకెన్నాళ్లకు.. ఎలా గుర్తొచ్చాం?" అంటూ ఆయనకు టీ అందించింది రాధిక. "చాలా రోజులయ్యిందనే కలసిపోదామని వచ్చాను. ఇదిగో.. నా కొత్త పుస్తకం మీకు స్వయంగా ఇద్దామని" అంటూ ఓ పుస్తకాన్ని చేతికి అందించారు.**

"నేనేమంటాను.. ఇప్పటికే ఆలస్యం చేసాం. త్వరగా ఆ పని ప్రారంభిద్దాం అంటాను. ఇంతకూ మన లైబ్రరీకి ఏం పేరు పెడదాం?" అనడిగాడు బృందావన్.

"సాక్షాత్తూ ఆ సరస్వతీదేవి పేరే పెడదాం. ఐరా గ్రంథాలయం" అని రాధిక చెప్పగానే చప్పట్లు కొట్టాడు బృందావన్. ✦



# నిజమేదీ..అబద్ధమేదీ?

యామిజాల జగదీశ్

**నగనగా ఓ రాజ్యం.**

**అదానికి ఒక రాజు ఉండేవాడు. అతను తరచూ అడవికి వెళ్లేవాడు. తనతో పాటు కొందరు మిత్రులను కూడా అడవికి తీసుకుపోతుంటాడు. అడవికి వెళ్లడంతోనే ఒక్కొక్కరు ఒక్కో దిక్కున వెళ్లి వేటాడుతారు.**

సాయంత్రం అయ్యేసరికి ముందనుకున్నట్టు అందరూ ఓ చోట చేరుకుంటారు. అక్కడి నుంచి కోటకు చేరుకుంటారు. మరుసటి రోజు అందరూ సభలో కూర్చుని ముందురోజు అడవిలో వేటాడుతున్నప్పుడు ఎదురైన అనుభవాల గురించి మాట్లాడుకుంటారు. వారి వీరత్వానికి తగినట్టు రాజు వారందరికీ ఏదో ఒక కానుక ఇచ్చేవాడు.

ఇలా ఓ మారు అందరూ వేటకు వెళ్లారు. తిరిగి వచ్చిన తర్వాత ఎప్పట్లాగే సమావేశమై మాట్లాడుకోవడం మొదలుపెట్టారు. ఒకడు తన శూరత్వాన్ని చెప్పడం మొదలుపెట్టాడు.

"రాజా, నిన్న నేను అడవిలో వెళ్లినప్పుడు ఏం జరిగిందో తెలుసాండీ? నాకు ఎదురుగా ఒక సింహం నోరు తెరుచుకుని వచ్చింది. అయితే అది అలా వస్తున్నందుకు నేనేమీ భయపడలేదు. వెంటనే ఓ రాయి తీసుకుని గురి చూసి విసిరాను. అది సింహం నోట్లోకి వెళ్లి దాని గొంతులో చిక్కుకుంది. అనంతరం ఆ సింహం నన్ను చూసి భయపడి వెనుతిరిగి పారిపోయింది" అన్నాడు.

"ఆహా, భలే భలే అంటూ" అందరూ చప్పట్లు కొట్టారు.

రెండో మనిషి తన అనుభవం చెప్పడం మొదలుపెట్టాడు.

"రాజా, నేను వెళ్లిన దారిలో రెండు కొండచిలువలు కనిపించాయి. నన్ను మింగడానికి వచ్చాయి. అయితే అప్పుడు నేను ఏం చేశానంటే ఆ రెండు పాముల తోకలు పట్టుకుని ముడి వేశాను. అంతే, ఒక పాము అటు మరో పాము ఇటు అలా అటూ ఇటూ లాక్కుంటూ తప్పుకోవడానికి ప్రయత్నించాయి. అయితే లాగుతుండటంతో ముడి మరీ గట్టిగా పడిపోయింది. దాంతో అవి నా దగ్గరకు రాలేకపోయాయి. ఆ తర్వాత నేను అక్కడి నుంచి వచ్చేశాను" అన్నాడు.

"అద్భుతం" అంటూ అందరూ చప్పట్లు కొట్టారు.

ఆ తర్వాత ఇంకొకడు చెప్పడం మొదలుపెట్టాడు.

"రాజా, నేను వెళ్లిన దారిలో అడ్డంగా ఓ నది ఉంది. అందులో దిగి స్నానం చేసాను. అయితే అలా స్నానం చేస్తున్నప్పుడు ఎవరో నా కాలు లాగుతున్నట్లు అనిపించింది. చూద్దును కదా.. అది ఒక మొసలి. వెంటనే నేను దాని పట్టు విదిలించుకుని దాని వీపు మీద కూర్చున్నాను. దాన్ని ఒడ్డు వరకు నీటి మీద పోనిచ్చి తీరం చేరాను. తీరానికి రావడంతోనే మొసలి వీపు నుంచి దూకి బయటపడి తప్పించుకున్నాను" అన్నాడు.

"అరెరె.. ఎంతటి తెగింపు నీది. నిజంగా నువ్వు హీరోవే" అని అందరు చప్పట్లు చరిచారు.

అనంతరం నాలుగో మనిషి లేచాడు.

"రాజా, నేను వెళ్లిన చోట ఓ ఎలుగుబంటి నన్ను తరుముకుంటూ వచ్చింది. నేను అతి వేగంగా పరిగెత్తుతూ పర్వతం అగ్ర భాగానికి చేరుకున్నాను. ఆ తర్వాత మరొక్క అడుగు వేస్తే నేను లోయలో పడిపోయేవాణ్ణి. అయితే సరిగ్గా అదే సమయంలో ఓ భారీ డేగ ఆ వైపుకు ఎగురుకుంటూ వచ్చింది. వెంటనే నేను ప్రాణం కాపాడుకోవడానికి ఒక్క ఉదుటున ఎగిరి దాని కాళ్లు పట్టుకుని సురక్షితంగా తిరిగొచ్చాను" అన్నాడు.

అతను చెప్పినదానికీ అందరు చప్పట్లు కొట్టారు. అతనిని మెచ్చుకున్నారు.

చివరగా ఒకడు లేచి నిల్చుని చెప్పడం మొదలు పెట్టాడు.

"రాజా, నేను వెళ్లిన దారిలో ఓ పెద్ద ఏనుగు వస్తోంది. దాని ఘీంకారం భీకరంగా ఉంది. అయితే నేనేమీ భయపడలేదు. అప్పుడు నేను ఏం చేసానంటే–

దాని తోక పట్టుకుని గట్టిగా ఊపాను. తల పైకెత్తి అతి వేగంగా అటూ ఇటూ తిప్పడం ప్రారంభించాను.

అప్పుడు ఏం జరిగిందంటే– అది నేను తోక పట్టుకుని ఊపడం తట్టుకోలేక అది తల్లడిల్లింది. అది అయోమయంగా ముందుకు పోతూ ఉండటంతో నేను మన ప్రదేశం రాగానే దాని మీద నుంచి దూకేసి కోటకు చేరుకున్నాను" అన్నాడు.

ఆ మాట వినడంతోనే రాజుకు కోపం వచ్చింది.

"ఏంటీ? నాకు తెలీదనుకున్నావా? నేనొక తెలివితక్కువ దద్దమ్మను అనుకున్నావా? నువ్వు ఏనుగుతోక పట్టుకుని అటూ ఇటూ తిప్పావా.. అది నేను నమ్మాలా, ఎలా అనుకున్నావు నేను మీ మాటలు నమ్ముతానని" అని మండిపడ్డాడు.

అప్పుడు అతను ఎంతో వినయంగా ఇలా అన్నాడు. "రాజా, ఓ సింహం నోట్లో రాయి అడ్డం పడటం, కొండచిలువల తోకలకు ముడివేయడం, మొసలి వీపు మీద కూర్చుని ప్రయాణించడం, డేగ కాళ్లు పట్టుకుని ప్రాణాలను కాపాడుకోవడం వంటివి నమ్మినప్పుడు నేను చెప్పింది మాత్రం మీరు నమ్మకూడదా?" అని అడిగాడు.

అబద్ధాలు చెప్పిన వారందరూ సిగ్గుతో తల దించుకున్నారు.

(మిగతా 27వ పేజీలో..)

# 'కవికోకిల' దువ్వూరు రామిరెడ్డి

జయసూర్య

తెలుగు సాహిత్య సీమలో ఈ శతాబ్దిలో సంభవించిన నవయుగ పరిణామాలను సహజకవి, కవిత్వ తత్త్వవేత్త కవికోకిల దువ్వూరి రామిరెడ్డి (1895-1947) కాలానుగుణమైన రచనలలో తాత్త్వికునిగా, మానవతా వాదిగా ప్రతిఫలింపచేసిన సృజనాత్మక మహాకవి. స్వయంకృషితో సంస్కృతాంధ్రాంగ్ల భాషలలోనే కాకుండా, పారసీక, తమిళ భాషా పండితునిగా, జర్మన్, ఫ్రెంచ్, వంగ భాషలలో పరిజ్ఞానం సంపాదించిన రామిరెడ్డి వంటి మహాకవి మరొకరు ఆంధ్ర సాహితీ జగత్తులో లేరని చెప్పొచ్చు. శాస్త్ర విజ్ఞానమే రామిరెడ్డి తాత్త్వికతకు మూలకందం. "నా వృత్తి వ్యవసాయం. విజ్ఞాన శాస్త్రం అత్యంత ఇష్టమైన విషయం" అంటూ ప్రధానంగా పద్యకవిగా పాశ్చాత్య సాహిత్య శాస్త్రాలను అభిమానిస్తూ, భారతీయ కావ్యాల అలంకారాలు, వర్ణనలు, రసదృష్టి కావ్యాత్మగా అంగీకరిస్తూ "రమణీయమైన అర్థాన్ని ప్రతిపాదించే శబ్దం" అనే కావ్య నిర్వచనాన్ని అనుసరించారు. జీవితంలోను, సాహిత్యంలోను స్వాతంత్ర్యాన్ని నియమబద్ధం అయిన సిద్ధాంతంగా ప్రతిపాదించిన రామిరెడ్డి 1916 కవిత్వ అంకుర దశలోనే రసిక జనానందము స్వప్నాన్వేషము, అహల్యానురాగము, కృష్ణుని రాయబారము వంటి ప్రబంధాలు రచించారు. ఋతుసంహారం, పుష్పబాణ విలాసం ఆంధ్రీకరించారు. 'ప్రథమ కవిత్వము' అనే ఖండ కావ్య సంపుటికి రాసిన విన్నపంలో తాను వేయి పద్యాలు మించి రచించిన విషయం నాడు పేర్కొన్నారు. 1918 నుండి 1932 వరకు రచించిన కవిత్వం అంతా నక్షత్రమాల, నైవేద్యము, భగ్నహృదయం, పరిశిష్టము ఖండకావ్య సంపుటాలుగా ఆవిష్కృతమైంది. కాలక్రమేణా నాటి నవీనాంధ్ర కవితా లక్షణాలైన ప్రణయం, దేశభక్తి, ఇతిహాస పాత్రలు, సన్నివేశాల వ్యాఖ్యానాలు, ప్రకృతి, తాత్త్విక చింతనలు, "ముసలి మాలెత" వంటి కావ్య ఖండాలు, నీతి ప్రబోధకాలు. 'మాతృశతకం'లో దేశాభిమానం వెల్లివిరిసాయి వనకుమారి మౌగ్ధ్యాన్ని, హృదయ పరివర్తనను మనోవిజ్ఞానవేత్తలా ఆవిష్కరించారు. 'జలదాంగన', 'కవి-రవి' కావ్యాల ఇతివృత్తాలు విజ్ఞానశాస్త్ర సంబంధితంగా విశ్వోత్పత్తి, మానవ అవతారాన్ని చిత్రిస్తాయి.

తెలుగు సాహిత్య ప్రస్థానంలో రామిరెడ్డి, రైతు కవిత్వానికి నాంది మొదటి కవిగా 'కృషీవలుడు' కావ్యం చాటి చెప్తోంది. మాతృభూమి దాస్యాన్ని రూపుమాపవలసినదిగా 'యువక స్వప్నము'లో ప్రబోధించారు. కవికి, నెరిసిన వెంట్రుకకు జరిగిన సంభాషణం 'పలిత కేశము' తెల్లవెంట్రుక "పృథివి జనులకు కాలంబు వేయుచున్న ప్రశ్న గుర్తు" అంటారు రామిరెడ్డి. మానవులకు భవిష్యత్‌లో సాధ్యం కానిది ఏమీ లేదంటూ టెస్ట్ ట్యూబ్ బేబీల ఆవిర్భావాన్ని పసికట్టి **"మచ్చుక్రోవుల జీవాణు మార్గమరసి చేతనము గొన్ని యేండ్లు సృజింపగలరు"** అంటూ ప్రస్తుత వైద్య శాస్త్రీయ వినూత్న జ్ఞానాన్ని నాడే ఆవిష్కరించారు. తాత్త్విక కావ్యం 'కడపటి వీడికోలు', 'ద లాస్ట్ ఫేర్‌వెల్'గా ఆంగ్లంలోకి అనువదించారు.




1928లో భారతిలో వచ్చిన 'పానశాల', పారసీక భాషలోని ఉమర్ ఖయ్యామ్ రుబాయిలకు అనువాదంగా, 'సాదీ' కవి పారసీక నీతి కావ్యాలు 'గులిస్తాన్', 'బోస్తాన్' గులాబితోట, పండ్లతోటలు పేరిట రామిరెడ్డికి ఖండాంతర ఖ్యాతి ప్రాప్తింపచేసాయి. జేమ్స్ హెచ్ కజిన్స్, రామిరెడ్డి ఖండకావ్యాలను ఆంగ్లంలోకి అనువదించి ప్రపంచ కవిగా గుర్తింపు లభింపచేసారు. 'బ్రిటిష్ ఎంపైర్ ఎడిషన్ ఆఫ్ ఇంగ్లీష్ పొయెట్రీ'లో రామిరెడ్డి పద్యాలు ఉన్నాయి.

విమర్శకునిగా దృశ్య శ్రవ్య కావ్య తత్త్వాన్ని, తెలుగు కవితా లక్షణాలను సమీక్షించారు. నాటక సంస్కరణలను అభిలషించే, కర్షక విలాసం, సీతా వనవాసం, కుంభరాణా, మాధవ విజయం, విశ్వమానవ జీవన తత్త్వాల సంఘర్షణకు 'కాంగ్రెస్‌వాలా' అద్దం పడ్తోంది. రామిరెడ్డి చలన చిత్ర రంగంలో కూడా ప్రవేశించారు. సతీతులసి చిత్రానికి కథ, సంభాషణలు, పాటలు, పద్యాలు రచించారు. చిత్రనళీయం దర్శకునిగా, వేంకటేశ్వర మహాత్మ్యం, పార్వతీ పరిణయం, సీతారామ జననం చిత్రాలకు పాటలు, పద్యాలు సమకూర్చారు.

**"అంతములేని యీ భువనమంత పురాతన పాంథశాల వి**
**శ్రాంతి గృహంబు, అందు ఇరు సంజలు రంగుల వాకిళుల్"**

తెలుగు సాహిత్య ప్రపంచంలో కవికోకిల దువ్వూరి రామిరెడ్డి అనితర సాధ్యమైన మహాకవిగా సుప్రతిష్ఠిత పొందారు.

దువ్వూరి రామిరెడ్డి 1895 సంవత్సరం నవంబరు 9న జన్మించారు. ప్రబంధాలు, అనువాదాలు, కావ్యాలు, నాటకాలు 1915 నుంచి 1944 వరకు సుమారు మూడు దశాబ్దాలు పద్యకవిగా తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసారు. 'పానశాల' కావ్యంలోని పద్యాలు, తెలుగు మాగాణంలో తరువాతి రచనలకు మార్గదర్శకంగా స్ఫూర్తి అందించాయి. తన కావ్యాలలో తెలుగునాట గ్రామసీమల ప్రకృతి అందాలను, సుందర దృశ్యాలను అద్భుతంగా వర్ణించి విలక్షణ కవిగా పేరు పొందారు. సాహిత్య శాస్త్ర సిద్ధాంతాలను, ప్రాచీన నవీన సాహిత్య లక్షణాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసిన రామిరెడ్డి 20వ శతాబ్ద ప్రారంభంనాటి భారతీయ, పాశ్చాత్య పరిణామాలను అవలోకించి విశ్వజనీన ప్రామాణికతతో తెలుగు సాహిత్యానికి జీవం అందించారు. 1929లో ఆంధ్ర మహాసభ విజయవాడలో 'కవికోకిల' బిరుదు వరించింది. 1947 సెప్టెంబరు 11న రామిరెడ్డి స్వర్గస్థులయ్యారు. కవికోకిల దువ్వూరి రామిరెడ్డి కవితాసృష్టి ప్రాచీన నవీన, ప్రాచ్య, పాశ్చాత్య సాహితీ మేలిమి సమ్మేళనంగా తెలుగు సాహిత్యాన్ని ప్రభావితం చేసింది. 1986లో ఆయన పేరిట విజ్ఞాన సమితి ఏర్పడింది. తెలుగు సాహితీ వనంలో కవికోకిల మధుర సుస్వర కవితా గానం వీనుల విందు చేస్తూనే ఉంటుంది.


# విశ్వాసం-విలువ

సి.హెచ్.నాగార్జున శర్మ

పరంధామయ్య, సుబ్బమ్మలు భార్యా భర్తలు. ఇద్దరూ ప్రభుత్వ ఉద్యోగాలు చేసి పదవీ విరమణ పొందారు. అనంత్, ఆకాశ్‌లు వారి పిల్లలు. ఎం.ఎస్.చెయ్యడానికి అమెరికాకు వెడతామంటే పంపించారు. చదువులు పూర్తయ్యాక అక్కడే ఉద్యోగాలు సంపాదించుకున్నారు. వారు ఇష్టపడ్డ వాళ్లతో పెళ్లిళ్లు చేశారు. ఇద్దరూ అమెరికాలోనే స్థిర నివాసం ఏర్పరచుకున్నారు.

ఓసారి పిల్లలిద్దరూ వాళ్ల భార్యలతో ఇండియాలో ఉన్న అమ్మా నాన్నల దగ్గరకొచ్చారు. ఓ సాయంకాలం పిల్లలిద్దర్నీ, కోడళ్లను వారి దగ్గర కూర్చోబెట్టుకుని "మేం పెద్దవాళ్లమై పోయాం, ప్రయాణాలు చెయ్యలేం. కాబట్టి మీరు ప్రతి ఏటా వీలైనప్పుడు ఇండియాకొచ్చి మాతో గడిపి తిరిగి అమెరికాకు వెళ్లండి. దానికి వాళ్లు ఒప్పుకున్నారు.

.......



పరంధామయ్య, సుబ్బమ్మలుంటున్నది లంకంత ఇంట్లో. ఇంట్లో పనులు చెయ్యడమైపోయాక నౌకర్లు వాళ్ల ఇళ్లకు వెళ్లిపోతారు. ఆ తరువాత వీళ్లిద్దరే. వాళ్లకు తోడుగా ఉండటానికి ఓ ఆల్సేషియన్ కుక్కను పెంచుకుందామని అన్నాడు భార్యతో.

ఆ మాటలు విన్న భార్య సుబ్బమ్మ భర్తతో "మరి ఇంట్లో పని చేస్తున్న నౌకర్లని ఏమి చేద్దాం?" అని అడిగింది.

"వాళ్లని ఉద్యోగంలోంచి తీసేద్దాం" అని అన్నాడు. "వాళ్లను ఉన్నపళంగా ఉద్యోగంలోంచి తీస్తే వాళ్లు ఇబ్బంది పడరూ! వారికి మరో ఉద్యోగం వచ్చేదాకా మన దగ్గరే పని చేయనిద్దాం అని చెప్పి భర్తతో "మీరు వాళ్లందర్నీ సమావేశపరచి వారితో మీరందరూ ఈ నెలాఖరు లోపల మరో ఉద్యోగాన్ని చూసుకోమని చెప్పండి" అంది.

"సరే. అలాగే చెబుతాను" అన్నాడు.

మర్నాడు ఇంట్లో పని చేస్తున్న నౌకర్లందర్నీ సమావేశపరచి "మీరందరూ ఈ నెలాఖరు లోపల మరో ఉద్యోగాన్ని చూసుకోండి" అని చెప్పాడు.

"ఎందుకని?" అడిగిన వారితో– "నేటి సభ్య సమాజంలో మనిషికి–మనిషికి మధ్య ఉండవలసిన నైతిక విలువలు నానాటికి దిగజారిపోతున్నాయి. ఆ నైతిక విలువలన్నీ ఆర్థిక సంబంధాలైపోతున్నాయి, అయిపోయాయి కూడా! ప్రస్తుతం వ్యవహారం 'తిన్న ఇంటి వాసాలు లెక్కపెట్టడం' దాకా వచ్చింది. ఇక ముందు ముందు నేనలా మోసపోకూడదన్న ఉద్దేశంతో ఓ కుక్కను పెంచుకోవాలనుకున్నాను. 'జాలిగుండె లేని కొడుకుకన్న కుక్క మేలురా' అన్నాడో సినీ కవి. మీకు బదులుగా, ఓ కుక్కను పెంచుకున్నామనుకోండి.. ఇంటికి కాపలాగానూ, మా పట్ల విశ్వాసంగానూ ఉంటుంది" అని చెప్పడంతో నౌకర్లందరూ మారు మాట్లాడకుండా తప్పు చేసినవారికి మల్లే తలొంచుకుని వారింటి ముఖం పట్టారు.

.......

సుబ్బమ్మ వంటింట్లో అంట్లు తోముకుంటున్నది. పరంధామయ్య హాల్లో సోఫాలో కూర్చొని పేపర్ చదువుకుంటున్నాడు. ఇంతలో 'పోస్ట్' అన్న పోస్ట్‌మాన్ కేకతో పోస్ట్‌మాన్ పోస్ట్ డబ్బాలో పోస్ట్ కార్డ్‌ని వేసి తన దారిన తను వెళ్లిపోయాడు. పరంధామయ్య పోస్ట్ డబ్బాలో వేసిన పోస్ట్ కార్డ్‌ని తీసుకున్నాడు. "ఎక్కడి నుండి వచ్చిందండీ ఉత్తరం?" అన్నది వంటింట్లోంచి సుబ్బమ్మ.

"అనంత్ దగ్గర్నుండి".

"ఉత్తరం చదివారుగా! సంగతులేంటో చెప్పండి" "అనంత్ భార్యా పిల్లలతో ఇండియాకు వచ్చే నెల్లో వస్తాడని రాసాడు. అదీ ఉత్తరంలోని సారాంశం".

.......

ఓ శుభ ముహూర్తాన అనంత్, భార్యా పిల్లాడితో ఇండియాకి వచ్చాడు. ప్రయాణ బడలిక తీర్చుకోవడానికి కోడలు స్నానం చెయ్యడానికి బాత్ రూములోనికెళ్లి సబ్బు బిళ్ల కోసం అంతా వెదికింది. అక్కడ సబ్బుబిళ్లకు బదులుగా సున్నిపిండి ఉన్నది. బాత్ రూములోంచి బయటకొచ్చి "ఏమండీ! బాత్ రూములో సబ్బుబిళ్లకు బదులు సున్నిపిండి ఉన్నదని" చెప్పింది.

ఆ మాటలు సుబ్బమ్మ చెవిన పడ్డాయి. కోడలితో "మేం పాత కాలం మనుషులం కదమ్మా! మీ మామయ్య గారు, నేను ఇప్పటికీ సున్నిపిండితోనే స్నానం చేస్తున్నాం. దాంతో స్నానం చెయ్యడం వల్ల ఆ నాటి నుండీ ఈనాటి వరకూ మాకెలాంటి చర్మసంబంధమైన వ్యాధులూ రాలేదు" అని చెప్పింది.

ఆ మాటలు విన్న కోడలు "అత్తయ్యా! ఆ సున్నిపిండితో నేను స్నానం చెయ్యలేనుగానీ, మీ అబ్బాయిని ఇంటి దగ్గరి కొట్లో సబ్బుబిళ్లను తీసుకురమ్మనండి" అని అన్నది కాస్తంత కోపంగా. ఆ మాటలు భర్త గారి చెవిన పడడంతో "పరుగున వెళ్లి సబ్బుబిళ్లను తీసుకొచ్చి తన భార్యకిచ్చాడు. భార్య స్నానం చెయ్యడానికి బాత్రూంలోకి దారి తీసింది. మరో పది నిమిషాల్లో స్నానం చేసి వచ్చి ముస్తాబై హాల్లోకొచ్చి కూర్చుంది. ప్రయాణ బడలిక నుండి రిలాక్స్ అయినట్లు ఆవిడ ముఖంలో కొట్టొచ్చినట్లు కనబడ్డదా సమయంలో.

.......

ఒకరోజు.. సుబ్బమ్మ భర్తతో "ఏమండీ! వంట చెయ్యాలి, లైటర్ పాడైపోయినట్లుందిగానీ అగ్గిపెట్టె ఎక్కడుంది?" అని అడిగింది సుబ్బమ్మ భర్తని. ఆమె మాటలు పరంధామయ్య భార్యతో "అగ్గిపెట్టె దేవుడి మందిరం దగ్గర ఉంటుంది చూడు" అని అన్నాడు.

"అందులో అగ్గిపుల్లలు నిండుకున్నాయి" అంది. "పరంధామయ్య ఇంటి ముందున్న కొట్లో అగ్గిపెట్టె తీసుకొచ్చి సుబ్బమ్మకిచ్చాడు.

అగ్గిపెట్టెతో గ్యాసుపొయ్యిని వెలిగించిన తర్వాత భార్య భర్తతో "దీన్ని బట్టి నాకో విషయం అర్థమైందండి" అని అన్నది.

"ఏంటా విషయం?"

"అవసరాన్నిబట్టీ ప్రతి వస్తువుకీ 'విలువ' ఉంటుందన్న విషయం".

"ఈ సందర్భంగా అగ్గిపుల్ల విలువ ఏపాటిదో నీకు తెలిసొచ్చిందన్నమాట" అన్నాడు నవ్వుతూ పరంధామయ్య భార్యతో.

"మనిషి విలువ మనిషి ఉన్నప్పుడు తెలీదు. ఆ మనిషి లేనప్పుడే ఆ మనిషి విలువ తెలుస్తుందన్న చందంగా వస్తువుల విలువ కూడా ఆ వస్తువులు లేనప్పుడే వాటి విలువ తెలుస్తాయి" అని అన్నాడు పరంధామయ్య.

# అవతార్ చిత్రానికి స్ఫూర్తి 'టియాంజీ'

షేక్ అబ్దుల్ వాకీం జాని

చైనా హువాంగ్ ప్రావిన్స్‌లోని జంగ్జియాజీ అనే పట్టణం సమీపంలో ఒలింగ్ ఇవాన్ ఈశాన్య ప్రాంతంలో జంగ్జియాజీ పర్వతాలు నెలకొని ఉన్నాయి. వీటిని టంగ్జియాజీ పర్వతాలు అని కూడా పిలుస్తారు. అన్నింటి కంటే ప్రధాన పర్వతం టియాంజీ పర్వతం. మొత్తం 16 వేల 550 ఎకరాలలో ఇవి విస్తరించి ఉన్నాయి. ఇన్ని వేల ఎకరాలలో కొన్ని వందల పర్వతాలు ఆకాశ హార్మ్యాల్లా పదునైన శిఖర కొనలతో ఎత్తైన స్తంభాల్లా విస్తరించి ఉన్నాయి. ఈ పర్వతాలు పెన్సిల్‌ను నిలబెట్టినట్లు ఉంటాయి. 1982 నుండి చైనా ప్రభుత్వం దీన్ని జాతీయ ఉద్యానవనంగా ప్రకటించింది. టియాంజీ అంటే చైనా భాషలో స్వర్గపుత్రుడు అని అర్థం. యునెస్కోవారు దీన్ని ప్రపంచ వారసత్వ ప్రదేశంగా ప్రకటించారు.

## టియాంజీ అనే పేరు ఎందుకు వచ్చింది?

ఈ పర్వతాలకు టియాంజీ పర్వతం అనే పేరు రావడానికి స్థానికులు ఒక కథ చెబుతారు. సాంగ్ వంశం చివరి దశలో టుజియా గిరిజన తెగ ఉండేది. ఆ తెగ నాయకుడి పేరు టియాంజీ. ఈ పర్వతాలకు ఆయన పేరే పెట్టారు. టియాంజీ ఈ పర్వతాల్లోనే చనిపోయినట్లు చెబుతుంటారు. గిరిజన తెగకు చెందిన జియాంగ్ డాకూన్ అనే వ్యక్తి 12వ శతాబ్దపు ప్రముఖుడు. ఆ సమయంలోనే స్థానిక రైతులను ఏకం చేసి వ్యవసాయంలో సంస్కరణలు తీసుకుని వచ్చి రైతు తలరాత మార్చాడు. అప్పటి నుండి అతడ్ని టియాంజీ అని జనం పిలుచుకునేవారు. భగవంతుడే అతడ్ని తమకోసం దివి నుండి భువికి పంపాడని అప్పటి స్థానికుల ప్రగాఢ విశ్వాసం. రాజరికం రాజ్యమేలుతున్న ఆ కాలంలో రాజును మించిన గౌరవాన్ని టియాంజీ పొందారు. ఆయన ఈ పర్వతం పైనే కన్ను మూశాడు. ఆయన ఆత్మ ఇక్కడ తిరుగుతుందని నేటికీ గిరిజన తెగలవారు నమ్ముతారు. స్థానికులు ఈ పర్వతాలను టియాన్‌మన్ మౌంటెన్స్ అని కూడా పిలుస్తారు. పర్వతం పై భాగానికి చేరడానికి లిఫ్ట్ సౌకర్యం ఉంది. అక్కడ నుండి కేబుల్ కార్లలో ఈ ప్రకృతి అందాలను వీక్షించవచ్చు.



## అద్భుతాలకు నిలయం

ఈ భూ ప్రపంచంలో అనేక అద్భుతాలు ఉన్నాయి. అటువంటి వాటిలో ఒకటి చైనాలోని టియాంజీ పర్వతాలు అని చెప్పవచ్చు. ఒంటి స్తంభపు మేడలను తలపించే పర్వతాలు, సాహసానికి ప్రతీకగా నిలిచే అద్భుతాలు, ఎవరూ అధిరోహించలేని ఆపదలతో కూడుకున్న ప్రకృతి రమణీయతకు అద్దం పట్టే ఎత్తయిన పర్వతాలు అవే అవతార్ పండోరా. ప్రకృతి గీసిన చిత్రం టియాంజీ నేచర్ రిజర్వ్, పర్వతాల మధ్య దర్పంగా టియాంజీ నిలబడి ఉన్నాయి. ఇప్పటివరకు ఈ పర్వతాలపై నరమానవుడు అడుగు పెట్టలేదని తెలుస్తోంది. 2009లో విడుదలైన 'అవతార్' చిత్రం అందరికీ తెలిసిందే. ఆ తరువాత 'అవతార్' రెండవ భాగం నిర్మించారు. ప్రేక్షకులను మరో లోకంలోకి తీసుకుని వెళ్లిన చిత్రం 'అవతార్'. ఈ చిత్రం పేరు వినగానే మనకు గుర్తుకొచ్చేది పండోరాతో పాటు గాలిలో వేలాడే ఎత్తయిన పర్వతాలు, ఎత్తయిన జలపాతాలు, మనకు ఎక్కడా తారసపడని వింతయిన జీవులు. అవతార్ చిత్రంలో వేలాడే పర్వతాలకు స్ఫూర్తి చైనాలోని టియాంజీ పర్వతాలు. ఇక్కడి ప్రకృతి రమణీయతను తిలకించి, పులకించిన దర్శకుడు జేమ్స్ కామెరూన్ 'అవతార్' చిత్రంలో పండోరా గ్రహాన్ని డిజైన్ చేసి పరమాద్భుతంగా చిత్రీకరించి చూపించారు. 'నావి' అనేది పండోరా గ్రహంపై బతుకుతున్న ఓ జాతి. చూడటానికి అచ్చం మనుషుల్లానే కనిపించే ఈ పొడుగాటి జాతిలో అనేక ఉప జాతులు కూడా ఉంటాయి. పండోరా గ్రహం మీద అనేక ప్రాంతాల్లో నావి జాతి ప్రజలు వేర్వేరు ఉప జాతులుగా విడిపోయి జీవిస్తున్నారు. వీళ్లలో ఒక్కొక్కరికి ఒక్కో ప్రత్యేకత ఉంటుంది. నావి జాతిలో 'ఒమటికాయ' ఓ ప్రజాతి. ఒమటికాయ ప్రజలు నీలం రంగులో మెరిసిపోతూ ఉంటారు. చెట్ల పైన జీవిస్తూ బాణాలు, ఇక్రాన్ అని పిలిచే డ్రాగన్ లాంటి జీవుల పైన ప్రయాణాలు చేస్తూ ఉంటారు. పండోరా పర్వతాలపై హీరోలు విహరించిన సీన్లు చూసి ప్రేక్షకులు పరమాద్భుతంగా ఆనందించారు. 2010లో ఈ పర్వతాల పేరు అధికారికంగా అవతార్ హల్లెలుజా మౌంటెన్‌గా పేరు మార్చారు. చైనావారు వీటిని స్వర్గానికి దారి అని పిలుస్తారు.

వేల సంవత్సరాల క్రితం ఏర్పడిన టియాంజీ పర్వతాలు వేగంగా వీచే పవనాలు, ప్రవహించే నీటి వలన కాలగతిన తమ ఆకారాన్ని మార్చుకుంటూ ప్రస్తుతం ఇలా మారాయి. ఈ పర్వత సమూహంలో ఎత్తైనది టియాంజీ పర్వతం. దీని ఎత్తు 4 వేల 142 మీటర్లు. కొందరు పరిశీలకుల అభిప్రాయానుసారం ఇవి లక్షలాది సంవత్సరాల క్రితం ఏర్పడి ఉండవచ్చు. టియాంజీ పర్వత పరిసరాల్లో పచ్చని అటవీ ప్రాంతం, జలపాతాలు, సున్నపురాతి గుహలు, ఔషధ మొక్కలు ఉన్నాయి.



టియాంజీ నేషనల్ ఫారెస్ట్ పార్క్ చైనాలో పేరు పెట్టబడిన మొదటి జాతీయ అటవీ ఉద్యానవనం. దీనిని 'నేచురల్ గార్డెన్', 'కింగ్‌డమ్ ఆఫ్ వైల్డ్ యానిమల్స్' అని పిలుస్తారు. కొన్ని దశాబ్దాల వరకు ఈ పర్వతాల గురించి చైనా దేశానికి మాత్రమే తెలుసు. ఆ తరువాత ఈ రమణీయ ప్రకృతి గురించి యావత్ ప్రపంచానికి తెలియడంతో పర్యాటకుల రద్దీ పెరిగింది. 'అవతార్' చిత్రం ద్వారా ఈ ప్రకృతి అద్భుతం అందరికీ తెలియడంతో పర్యాటకుల సంఖ్య మరింతగా పెరిగింది.

వర్షాకాలంలో మేఘాలు ఈ పర్వతాలను తాకుతూ వెళతాయి. శీతాకాలంలో టియాంజీ పర్వత శ్రేణిపై దట్టమైన మంచు కమ్ముకుంటుంది. సూర్యకిరణాలు వీటిపై పడినప్పుడు టియాంజీ పర్వతాలు దేదీప్యమానంగా మెరుస్తుంటాయి. శీతాకాలంలో వర్ణనాతీత ద్విగుణీకృత అందాలతో అద్భుత దృశ్య కావ్యంగా కన్పిస్తుంది. దేవలోకంలో ఉన్నామా అనే అనుభూతి కలగక మానదు. టియాంజీ పర్వతాలను ఏ శిల్పీ చెక్కలేదు. ఇవి ప్రకృతి చెక్కిన పర్వతాలే.



## అంతుచిక్కని రహస్యాలు

టియాంజీపై చైనా జానపదాల్లో అనేక గాథలు ప్రచారంలో ఉన్నాయి. టియాంజీపై ఎవరూ ఎందుకు అడుగు పెట్టలేదనేది ఇప్పటికీ అంతుచిక్కని రహస్యంగానే మిగిలింది. ప్రకృతి చెక్కిన తొమ్మిది మెట్లు ఇక్కడ ఉంటాయి. ఏదో ఒక శక్తి టియాంజీ పర్వతాల్లో ఉందని స్థానికుల విశ్వాసం. ప్రపంచ వ్యాప్తంగా ప్రమాదాన్ని హత్తుకునే ఎందరో పర్వతారోహకులు ఉన్నారు. అటువంటి వారిని సైతం ఈ పర్వతాలు భయపెడుతున్నాయా? చైనా ప్రభుత్వం వీటిని అధిరోహించడానికి ఎందుకు అనుమతించడం లేదు? గతంలో ఈ పర్వతాలను ఎక్కడానికి ప్రయత్నించినవారెమయ్యారు? అనే ప్రశ్నలు రహస్యంగానే మిగిలాయి. ఆలోచించి చూస్తే టియాంజీ పర్వతాలను అధిరోహించడం అంత తేలికైన విషయం కాదని తెలుస్తుంది. కారణం.. ఇవి స్తంభాల్లా నిటారుగా ఉంటాయి. ఎక్కేటప్పుడు కేవలం ఒక్క పాదంపైనే నిలబడవలసి ఉంటుంది. అలా నిలబడి ఎక్కడం సాధ్యమయ్యే పని కాదు. చాలా మంది సాహసికులు టియాంజీ ముఖద్వారం వరకు వెళ్లారు. ఆ తరువాత ముందుకు వెళ్లడం ఎవరివల్లా కాలేదు. ఒకవైపు ప్రమాదం, అంతుచిక్కని రహస్యం మరోవైపు. దాంతో ఎవరూ దీన్ని ఎక్కే ప్రయత్నం చేయలేదు. పైకి ఎక్కేకొద్దీ ఆక్సిజన్ అవసరం ఎక్కువవుతుంది. లక్షలాది ఏళ్లుగా ప్రకృతి వైపరీత్యాలను తట్టుకుని చురకత్తుల్లా మొనతేలిన ఈ రాళ్లపై అడుగు తీసి అడుగు వేయడం గగనమే. నిశ్శబ్దంగా ఉన్న వాతావరణంలో ఒక్కసారి హోరెత్తించే గాలి, చెవులు పగిలేలా పెద్ద పెద్ద వింత శబ్దాలు వినిపిస్తాయి. యుద్ధభేరీల శబ్దాలు కూడా వినిపిస్తాయి. వందలాది గుఱ్ఱాలు ఒక్కసారి సకిలిస్తే వచ్చే వింత శబ్దాలు వినిపిస్తాయి. చాలా మంది కూర్చుని గుసగుసలాడుతున్నట్లు శబ్దాలు వినిపిస్తాయి. ఇటువంటి వాతావరణం ఎంతటి సాహసికైనా తడిసి మోపెడవుతుంది. ఇటువంటి చేదు అనుభవాల వల్ల ఏ సాహస యాత్రికుడు సైతం తన ప్రయాణాన్ని ముందుకు కొనసాగించలేకపోయాడు. కొద్దిమంది మాత్రమే కొంతమేరకు వెళ్లి ఇక్కడి వింత మిస్టరీకి భయపడి వెనుదిరిగి వచ్చారు. టియాంజీ పర్వతాలలో నెలకొని ఉన్న ఒక సరస్సును ఇప్పటి వరకు మనిషన్నవాడు చేరుకోలేదు. వందలాది ఏళ్ల క్రితం ఎవరైనా ఈ పర్వతాలను అధిరోహించారో? లేదో? ఎవరికీ తెలియదు. కానీ వందేళ్ల చరిత్రలో వీటిని మనుషులు ఎక్కిన దాఖలాలు లేవు. ఇప్పటికీ ఇదో రహస్య ప్రదేశంగానే మిగిలింది. ఇన్ని కారణాల వల్ల ఎవరూ ఈ పర్వతాలను ఎక్కకుండా చైనా ప్రభుత్వం అనేక చర్యలను చేపట్టింది. కేబుల్ కార్ల ద్వారా విహంగ వీక్షణం చేయడానికి మాత్రమే అనుమతి ఇస్తున్నారు. చైనా జానపదాలు సైతం ఈ విషయాన్ని ధృవీకరిస్తున్నాయి. అయితే నేటి తరంవారు ఇటువంటి విషయాలను కొట్టిపారేస్తున్నారు.

ఇరుకు పర్వతాల మధ్య బలమైన గాలులు వీచినప్పుడు పలు రకాల శబ్దాలు వస్తాయని, అంతకుమించి ఎటువంటి రహస్యం లేదని నేటి తరంవారు చెబుతున్నారు. అలసిన శరీరంతో పర్వతాలను అధిరోహించే వారికి ఈ శబ్దాలు మరింత ఆందోళన కలిగించి ఉంటాయి. సున్నపురాళ్ల సొరంగాల్లోంచి వీచే గాలితో గుఱ్ఱపు సకిలింపుల శబ్దాలా మారి ఉండవచ్చు. ప్రమాదాలు నివారించేందుకే ప్రభుత్వం పర్వతారోహకులను అనుమతించడం లేదనేది నేటి తరం వాదన. ఏప్రిల్, మే, సెప్టెంబరు, అక్టోబరు మాసాల్లో ఈ అద్భుత పర్వతాలను చూడటానికి సరైన సమయం. జంగ్జియాజీ స్టేషన్ నుండి బస్సులో గంటన్నర ప్రయాణం చేసి ఇక్కడికి చేరుకోవచ్చు. ఆ తరువాత బ్యాటరీతో నడిచే కేబుల్ కారులో ఆకాశంలో విహరిస్తూ విహంగ వీక్షణం చేయవచ్చు.

## టియాంజీ గ్రాండ్ కాన్యాన్

అమెరికాలో గ్రాంగ్ కాన్యాన్ వాచింగ్ టవర్ గ్లాస్ వంతెన ఉన్న విషయం అందరికీ తెలిసిందే. అటువంటిదే టియాంజీ గ్రాండ్ కాన్యాన్ గ్లాస్ బాటమ్ బ్రిడ్జి ఇక్కడ ప్రత్యేక వింత. ఈ గాజు నడక వంతెన ప్రపంచంలోనే పొడవైనది, ఎత్తైనది. దాదాపు 300 మీటర్ల ఎత్తులో ఉన్న పారదర్శకత కలిగిన అద్దాల నడక వంతెన నుండి ప్రకృతి రమణీయ దృశ్యాలు తిలకించడం మరో ప్రపంచంలో విహరించినట్లే ఉంటుంది. రెండు పర్వతాలను కలుపుతూ గాల్లో వేలాడుతున్న అనుభూతి కలిగించే ఈ గ్లాస్ వంతెన పొడవు 980 అడుగులు. దీనిపై నడుస్తుంటే ఆకాశంలో విహరించిన అనుభూతి కలుగుతుంది. కోట్ల రూపాయల ఖర్చుతో ఈ గ్లాస్ బాటమ్ వంతెనను ప్రత్యేకంగా పర్యాటకుల్ని విశేషంగా ఆకర్షించేందుకు నిర్మించారు.

# నీలోనే అనంత శక్తి ఉంది

డా॥ పులివర్తి కృష్ణమూర్తి

ఆధునిక యుగంలో ఆత్మవిశ్వాసాన్ని కోల్పోతున్న యువత కన్పడుతోంది. ఇందుకు కారణం వారంతా యాంత్రికమైన జీవనాన్ని గడపడమేనని పెద్దలు చెబుతున్నారు. క్షణ భంగురమైన ప్రాపంచిక సుఖాల కోసం పాకులాడుతూ, ఉరుకులూ పరుగులూ తీస్తున్నారు. క్షణం తీరిక లేకుండా శ్రమిస్తున్నారు.

కానీ ఒక్కసారైనా తనలోకి తాను తొంగిచూసుకునే ప్రయత్నం గావించడం లేదు. మరికొందరు తమపై తాము నమ్మకం వుంచుకోలేకపోతున్నారు. ఇంకొందరు ఎల్లప్పుడూ ఎవరో ఒకరి మీద ఆధారపడుతున్నారు. ఇక మరో రకం యువత కనపడుతోంది. అంతా భగవంతుడే చేస్తాడు అంటూ గడుపుతారు. మామూలుగానైతే భగవంతుడి మీద విశ్వాసం లేనివాడిని నాస్తికుడు అనడం కద్దు. కానీ నేటి రోజుల్లో తనపై తనకు నమ్మకం లేనివాడిని నాస్తికుడు అనాలని అంటున్నారు.



ఒకసారి ముగ్గురు స్నేహితులు ఒక అడవి గుండా వెళ్తున్నారు. అంతలో ఒక పులి వచ్చింది. మొదటివాడికి ఎంతో భయం వేసింది, వణికిపోతున్నాడు. ఇక నా పని అయిపోయింది అనుకుంటున్నాడు. ఇతనికి తనపై తనకు విశ్వాసం లేదు, భగవత్ శక్తిపై సైతం నమ్మకం లేదు. రెండవవాడు దైవంపై విశ్వాసం వున్నవాడు. తన ప్రాణాలను కాపాడమని భగవంతుని ప్రార్థిస్తూ కూచున్నాడు.

మూడవవాడు తన శక్తిపై తనకు విశ్వాసం కలిగినటువంటివాడు. వెంటనే అతను పక్కనున్న చెట్టు ఎక్కాడు. తన ప్రాణాలను రక్షించుకున్నాడు. అంటే అతనికి అతనిపై అంతగా నమ్మకం కలిగినవాడు. ఇలాంటి మనోధైర్యం మనిషిని ముందుకు నడిపించి, విజయ సోపానాలు అధిరోహింపజేస్తుంది.

మూడవ వ్యక్తి అటు భగవంతుడిపై శ్రద్ధనూ కలిగి వున్నాడు, ఆపైన తన శక్తి సామర్థ్యాలనూ అమితంగా గౌరవించుకుంటున్నాడు. అంతా భగవంతుడే చూసుకుంటాడులే అని చేతులు ముడుచుకుని కూర్చోలేదు.

మీరొక్కసారి వివేకానందుడి చరిత్రను చదవండి. మీకు ఆత్మవిశ్వాసం అంటే ఏమిటో బోధపడుతుంది.. అమెరికాలో అతని చేతిలో చిల్లిగవ్వ లేదు. ఎవరూ తెలియదు. తనకు ఇచ్చిన సిఫారస్ ఉత్తరం కనబడలేదు. ఏం చేయాలో తోచని స్థితి. అయినా ఏమాత్రం తన ఆత్మస్థైర్యాన్ని పోగొట్టుకోలేదు. ఉక్కుమనిషిలా నిలబడి, తాను అనుకున్నదానికన్నా అధికంగానే సాధించగలిగాడు.

నేటి యువత వారిని ఆదర్శంగా తీసుకుని జీవితంలో తాము నిర్దేశించుకున్న గమ్యాలను చేరుకోవాలి. మనందరిలోనూ అద్భుతమైన శక్తి దాగి వుంది. అదే ఆత్మస్థైర్యం. దాన్ని మనందరం విశ్వసించాల్సి వుంది. ఆ అనంత శకినతని మనం బహిర్గతం గావించుకుని, ఆత్మవిశ్వాసంతో ప్రయత్నించాలి.

ఇక విజయం మీదే.!

(22వ పేజీ తరువాయి)

## నిజమేదీ... అబద్ధమేదీ?

రాజు వారిని చూసి, మీరందరూ కలిసి నన్ను తెలివితక్కువ దద్దమ్మను చేశారు. చివరగా మాట్లాడిన వ్యక్తి నాకు నిజం ఏదీ, అబద్ధం ఏదీ అని అర్థమయ్యేలా చేశాడు. నిజం చెప్పాలంటే ఇతనే నిజమైన ధైర్యశాలి" అంటూ అతనికి బహుమతి ఇచ్చాడు, అతనిని ఎంతగానో మెచ్చుకున్నాడు.

నిజాన్ని నిజంగా చెప్పగలిగినవాడే నిజమైన ధీశాలి అనేది ఎవరైనా నమ్మాలి. కానీ ఈ రోజుల్లో అబద్ధం చెప్పినతనే బతగ్గలమని చాలా మంది అభిప్రాయం.

ఓ తండ్రికి తన కొడుకు అబద్ధాలాడలేకపోతున్నాడని దిగులు. అబద్ధాలాడితేనే ఈ ప్రపంచంలో బతకొచ్చని ఆ తండ్రి అభిప్రాయం. కానీ వాడికది తెలీలేదే అని బాధ. అందువల్ల అతనిని తీసుకుపోయి ఓ అడవిమధ్యలో విడిచిపెట్టాలని అనుకుని బయలుదేరాడు.

ముందుగా సముద్ర తీరానికి చేరుకున్నాడు కొడుకుతో సహా. కొడుకుకి సందేహం. మా నాన్న నన్ను ఎక్కడికి తీసుకుపోతున్నారని ఆ కొడుకు అనుకుని తండ్రిని అడిగాడు. "సముద్రంలో చేపలు పట్టడం ఎలాగో నీకు నేర్పాలని అనుకుంటున్నాను" తండ్రి చెప్పాడు.

అయితే కొడుకు తనకెప్పుడో చేపలు పట్టడం వచ్చని చెప్పాడు.

"ఏంటీ? నువ్వు చేపలు పట్టేవా? ఏదీ చూపించు" అని అడిగాడు తండ్రి. "ఏం నాన్నా! ఇంతసేపు ఉట్టినే ఉంటానా? ఎప్పుడో వాటిని వండి తినేశాను" అన్నాడు కొడుకు. కొడుకు మాటలు విన్న తండ్రి "సరే... తన కొడుకు బతకనేర్చినవాడే" అని మనసులో అనుకుని అతని భుజం తట్టి "సెభాష్" అని ఇంటికి తీసుకుపోయాడు.



# వారఫలం

శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్కురాలు
నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు,
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్: 9849453449, 9440927795

## మేషం



జీవితాశయం దిశగా అడుగులు ముందుకు వేస్తారు. ప్రభుత్వ రంగ పరీక్షలలో విజయం సాధిస్తారు. వ్యక్తిగత హోదా పెంపొందుతుంది. నిక్కచ్చియైన వ్యవహార శైలిని కనబరుస్తారు. ఆత్మవిశ్వాసాన్ని కలిగి వుంటారు. ఉన్నతోద్యోగ యత్నాలు ఫలిస్తాయి. మీరు చేసే ప్రతి పనిలోనూ ఎంతో కొంత పురోభివృద్ధి కనబడుతుంది. సహోదర వర్గం అండ లభిస్తుంది.

## వృషభం



వ్యక్తిగత వ్యవహారాలు అనుకూలంగా వుంటాయి. ఉపయుక్తంలేని వ్యవహారాలతో కాలం గడుస్తుంది. విందు-వినోదాలలో పాల్గొంటారు. ఒకే సమయంలో అనేక విధాలుగా శ్రమించి పలువురి నుండి ప్రశంసలు అందుకునే ప్రయత్నాలు చేస్తారు. ఫైనాన్షియల్ రంగంలోనివారు జాగ్రత్తగా మెలగడం మంచిది. శుభ కార్యాల నిమిత్తం రుణాలు చేస్తారు.

## మిథునం



మిశ్రమ ఫలితాలు గోచరిస్తున్నాయి. గోప్యతకు ప్రాధాన్యమివ్వడం ఎంతైనా అవసరం. అర్థంలేని వివాదాలలోకి మిమ్మల్ని లాగబడే యత్నాలు జరుగుతాయి. మానవతా దృక్పథంతో ఒకరికి సహాయం చేస్తారు. ఇందువల్ల చిక్కులు ఏర్పడతాయి. అవసరాలకు తగినంత ధనం కలిగి వుంటారు. కుటుంబ సభ్యుల అండ కొండంత ధైర్యాన్నిస్తుంది.

## కర్కాటకం



ప్రయాణాలు, చర్చలు సానుకూల ఫలితాలనిస్తాయి. అయినా నిష్కారణమైన భయం, భ్రాంతి చోటు చేసుకుంటాయి. విందు, వినోద కార్యక్రమాలలో అపశృతులు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు వహించండి. క్రయ-విక్రయాలు సాగిస్తారు. వృత్తి, ఉద్యోగాల పరంగా అనుకూలం. ధనం బాగా ఖర్చు చేస్తారు. కళా, సాహిత్య, సాంస్కృతిక రంగాల్లోని వారికి అనుకూలం.

## సింహం



వృత్తి, ఉద్యోగాల పరంగా అనుకూలమైన మార్పులు చోటు చేసుకుంటాయి. విదేశీయాన యత్నాలు ఫలిస్తాయి. క్షణం కూడా వృథాగా పోనివ్వరు. మొండి ధైర్యం, పట్టుదలను కలిగి వుంటారు. అంతర్లీనమైన వేదాంత ధోరణి కనబడుతుంది. శత్రు వర్గంపైన విరుచుకు పడతారు. అనారోగ్య పరమైన సమస్యలు చోటు చేసుకోవచ్చు. మాటతీరు వివాదాస్పదంగా ఉంటుంది.

## కన్య



మిశ్రమ ఫలితాలు అందుకుంటారు. అన్యమనస్కంగా పనులు పూర్తి చేస్తారు. తగాదాలకు చేరువగా వుంటారు. ఆర్థిక స్థితి బాగుంటుంది. రుణాలు చేసినా సద్వినియోగం అవుతాయి. సహోద్యోగులతో విభేదాలు ఏర్పడే సూచనలున్నాయి. నిగూఢమైన మీ మనస్తత్వం అర్థం చేసుకోవడం సన్నిహితులకు సైతం కష్టంగా పరిణమిస్తుంది.

## తుల



ప్రతి విషయంలోనూ ప్రశాంతమైన మనస్సుతో ఆలోచించి నిర్ణయాలు తీసుకోండి. తొందరపాటు కూడదు. మీ ప్రాధాన్యతను తగ్గించే యత్నాలు సాగినప్పటికీ అవి తాత్కాలికమే అవుతాయి. విసుగు, ముక్కు మీద కోపం, కొత్త చిక్కులను తెచ్చిపెడతాయి. ఆర్థిక పరమైన సర్దుబాట్లు చేసుకోవడం కొంత కష్టంగా పరిణమిస్తుంది. శుభ కార్య ప్రసంగాలు చోటు చేసుకుంటాయి. కుటుంబ సభ్యుల అండదండలు లభిస్తాయి.

## వృశ్చికం



మీ నిర్ణయాలు వివాదాస్పదమైనప్పటికీ లాభిస్తాయి. వృత్తి, ఉద్యోగాల పరంగా ఏర్పడే అవాంతరాలను అవలీలగా అధిగమిస్తారు. వ్యక్తిగత హోదా పెంపొందుతుంది. అనవసరమైన విషయాలతో కాలాన్ని వృథాగా పోనివ్వరు. గతంలో చేసిన కృషి తాలూకు ఫలితాలు ఈ వారం అందుకుంటారు. దూర ప్రాంత ప్రయాణాలు, రహస్య చర్చలు, వ్యూహ-ప్రతివ్యూహాలు అంశాలు అనుకూలం. ప్రతిరోజూ హనుమాన్ చాలీసా పఠించండి.

## ధనుస్సు



అన్నింటా మీదే పై చేయిగా వుండాలని భావిస్తారు. అందుకు తగిన విధంగా శ్రమిస్తారు కూడా. ఆదాయానికి, వ్యయానికి పొంతన కొరవడుతున్నట్లుగా భావిస్తారు. ఉత్సాహపరిచే ఆత్మీయ వర్గం అండ లభిస్తుంది. మీ పెద్దరికాన్ని పెంచే విధంగా ఓ సంఘటన చోటు చేసుకుంటుంది. కరస్పాండెన్స్ లాభిస్తుంది. న్యాయబద్ధంగా మీకు రావలసిన ప్రయోజనాలు కొంత జాప్యం మీద అందుకుంటారు.

## మకరం



వ్యాపార పరంగా ప్రజా సంబంధాలు బలపడతాయి. రాని బాకీలు వివాదాస్పదమయ్యే సూచనలు. తనఖా వస్తువులను విడిపిస్తారు. చాలా విషయాలలో దైవం మీద భారం వేసి శక్తి సామర్థ్యాలను నమ్ముకుని ముందడుగు వేస్తారు. అవకాశం వుండీ మీకు సహకరించని వర్గంతో విభేదిస్తారు. ఆరోగ్యపరమైన జాగ్రత్తలు అవసరం. మానసిక ప్రశాంతతను కోరుకుంటారు, అందుకు సంబంధించిన విషయాల పైనే దృష్టి కేంద్రీకరిస్తారు.

## కుంభం



పలు రంగాల పట్ల విషయ పరిజ్ఞానాన్ని పెంచుకోవడానికి జిజ్ఞాసను కనబరుస్తారు. కుటుంబ వ్యవహారాలను, వృత్తి, ఉద్యోగ పరమైన అంశాలను నేర్పుగా సమర్థించుకోగలుగుతారు. శుభ కార్యాలను సానుకూల పరచుకోవడానికి మధ్యవర్తులను ఆశ్రయించాల్సి వస్తుంది. మీరు తీసుకునే నిర్ణయాల పైన కట్టుబడి ఉంటారు. రాజకీయ సంబంధాలు ఉపకరిస్తాయి.

## మీనం



వ్యాపార పరంగా అభివృద్ధి చేకూరే అవకాశాలు గోచరిస్తున్నాయి. విద్యా, సాంస్కృతిక, సినీ, కళా రంగాలలోని వారికి కొత్త అవకాశాలు లభిస్తాయి/అనుకూలమైన మార్పులో చోటు చేసుకుంటాయి. తలపెట్టిన పనులను నిర్విఘ్నంగా పూర్తి చేస్తారు. సహోదరీ వర్గంతో విభేదాలు ఏర్పడవచ్చు. వృత్తి, ఉద్యోగాలలో ఆధిపత్యం కోసం శ్రమిస్తారు. జీవితాన్ని కొత్త కోణంలో చూస్తారు. బహుమతులను ఇచ్చి పుచ్చుకుంటారు.

# వాస్తువార్త

వాస్తు విద్వాన్ సాయిశ్రీ
డా॥ దంతూరి పండరినాథ్
3-2-4, కింగ్స్‌వే, సికింద్రాబాద్
సెల్స్: 9885446501/9885449458



# ఆరోగ్య సమస్యలు తీరేదెలా?

కె.ఎమ్.సుధీర్- కాకినాడ

ప్రశ్న: మేం మా కంపెనీ క్వార్టర్స్‌లోకి వచ్చినప్పటి నుండి నేను అనారోగ్యసమస్యలతో సతమతమవుతున్నాను. నాకు బాబు పుట్టాడు. మా వారికి డయాబెటీస్, తరువాత నాలుగు నెలలకు గుండెనొప్పి వచ్చింది. ఇప్పుడు మందులు వాడుతున్నారు. నాకు రోజూ ఒక గండంగా గడుస్తున్నది. ఇది మా ఇంటి వల్లనా? లేక జాతకం వల్లనా? ఎందుకీ కష్టాలు? మా ఇంటి వివరాలు పంపుతున్నాను. ఏం చేయాలో తెలపగలరు.

జవాబు: మీ ఇంట్లో ద్వారాలు చాలా మంచి స్థానాల్లో వున్నాయి. నడక ఉచ్చంలో జరుగుతోంది. ఈ ఇంటి మూలంగా మీకు వున్న చెడు ఫలితాలు కలిగే అవకాశం లేదు. ఒకవేళ ఇంటికి బయటి వైపు నీచ స్థానంలో ఏదైనా వీధిపోట్లు వుంటే వుండవచ్చు. హాల్లో ఆగ్నేయ మూలలో ఒక స్టౌ అమర్చి రోజూ ఉదయం తూర్పుకు అభిముఖంగా నిలబడి/కూర్చుని స్టౌ మీద మొదటి వంట చేయండి. ఆ తరువాత యిప్పుడు చేస్తున్న దగ్గర కూడా ఆగ్నేయ మూలలో వంట చేయడం వల్ల మీకు మంచి ఫలితాలు కనిపిస్తాయి. వీధిపోటు ఏదైనా వుంటే దాన్ని తప్పక నవరించాలి.

## చదువుకునేటప్పుడు ఏ వైపు ముఖం చేయాలి?

ఎస్.వసుధ - విజయవాడ

ప్రశ్న: కొంతమంది వాస్తు శాస్త్రజ్ఞులు ఇంటికి సంబంధించిన గదులు ఎక్కడ ఏ దిశలో కట్టుకోవాలో తెలియజేశారు. అలాగే నిద్ర ఏ వైపుకు తల వుంచి నిద్రించాలో, లెట్రిన్‌లో ఏ వైపుకు ముఖం చేయాలో తెలియచేశారు. కానీ చదువుకునేటప్పుడు, తినేటప్పుడు ఏఏ వైపులకు వుండాలో తెలియచేయలేదు. కనుక మీరు దయ వుంచి తెలుపగలరు.

జవాబు: చదివేటప్పుడు ఏ గదిలోనైనా నైరుతి మూలన తూర్పుకు అభిముఖంగా ఏదైనా ఆసనం మీద కూర్చుని చదవటం వలన మంచి ఫలితం వుంటుందని నేను చాలా సార్లు సమాధానాలతో రాశాను. భోజనం చేసేటప్పుడు ఇంటి యజమాని తూర్పుకు అభిముఖంగా కూర్చుని భోజనం చేస్తే చాలు. ఇంటిల్లిపాదీ ఏ దిశలోనయినా కూర్చుని భోజనం చేయవచ్చు.

## ఆగ్నేయంలో నీటిపంపు ఉండవచ్చా?

సి.మంజుశ్రీ - కొత్తకోట

ప్రశ్న: మాకు ఈశాన్యంలో బావి, పంపు వున్నాయి. ఆగ్నేయంలో పంపు వేస్తే కిరాయిదారులకు సౌలభ్యంగా వుంటుంది. అలా చేయవచ్చా?

జవాబు: ఆగ్నేయంలో నీటిపంపు వుండకూడదు. ఈశాన్య మూల నుండి ఆగ్నేయ మూల వరకు వున్న నిడివి కొలిచి అందులో సగ భాగంలో గోడ మీద 'మార్కు' చేసి ఆ మార్కు దగ్గర పంపు వేయవచ్చు. అలా చేస్తే పంపు ఇంటికి తూర్పు భాగంలో అమరుతుంది. తూర్పు, ఉత్తర భాగాల్లో అలా పంపు వేయవచ్చు. ఈ ఇంటికి దక్షిణాన (ఆగ్నేయానికి దగ్గరగా) వున్న కిరాయిదారులకి ఈ పంపు దగ్గరగా అమరుతుంది. కనుక మీ సమస్య, వాళ్ల సమస్య కూడా తీరుతుంది.

## ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే?

సి.మంజూష - పోల్కంపల్లి

ప్రశ్న: అందరూ మా దగ్గర డబ్బులుంటాయనుకుంటారు కానీ మా ఆర్థిక పరిస్థితి ఏమంత బాగాలేదు.

జవాబు: పూర్తి ఈశాన్యం మూలన పూజ చేయడం మానండి. ఈశాన్య మూల నుండి కనీసం ఒక అడుగు స్థలం వదిలి పటం పెట్టి పూజించండి.

## నిస్పృహ నుండి తేరుకోవాలంటే?

బి.కార్తిక్ - నిడదవోలు

ప్రశ్న: ఉద్యోగంలో అడుగడుగునా అవరోధాలు, అశాంతి, అనారోగ్యాలు, ఆర్థికంగా ఏమీ కలిసి రావటం లేదు. ఎప్పుడూ అయోమయం, భయం, నిస్పృహకు లోనవుతున్నాను.


జవాబు: ఇంటి ప్లాను చూస్తే మీ మానసిక పరిస్థితి తెలిసిపోతున్నది. ప్రస్తుతం వంట చేస్తున్న చోట వంట చేయడం మానండి. అక్కడ పూజ చేయండి. ఇప్పుడు మంచం వేసిన చోట తూర్పుకు అభిముఖంగా వంట చేయండి. కాంపౌండు గోడలు గమనించండి. తూర్పు గోడలను ఆనుకుని ఆగ్నేయ మూలన వున్న 'ఒక గది' అది లెట్రిన్ అయినా, బాత్రూమ్ అయినాసరే దాన్ని తీసివేయండి. దాని పైన కప్పు కూడా తీసేయాలి.

మీ ఇంట్లో నుండి(పోర్షన్‌లో నుండి) బయటకు వచ్చే ద్వారం ఉత్తర వాయవ్యంలో వుంది. దాన్ని ఉత్తర ఈశాన్యం వైపుకు మార్చండి. అలాగే సింగిల్ రూముకున్న తలుపును కూడా ఈ తలుపుకు ఎదురుగా వచ్చేట్టు మార్చండి. మీ పరిస్థితులు నెల రోజుల తరువాత మారటం ప్రారంభిస్తాయి.

ఇంట్లో వున్న ఎనిమిది దిక్కుల్లోకెల్లా నైరుతి దిక్కు ఎక్కువ ఎత్తు వుండాలి. ఈశాన్య దిక్కు ఎక్కువ పల్లం వుండాలి. ఈ రెండు దిక్కులు మాత్రమే సరిచూసుకుంటే సరిపోదు. నైరుతి దిక్కుకంటే ఆగ్నేయం పల్లంగా వుండాలి. ఆగ్నేయ దిక్కు కంటే వాయవ్య దిక్కు పల్లంగా వుండాలి. ఈశాన్యం నేల '0' లెవలుకు వుందనుకుంటే వాయవ్యం నేల ఒక యూనిట్(అంగుళం/అడుగుగానీ ఎత్తున వుండాలి). వాయవ్యం కంటే ఆగ్నేయం రెండు యూనిట్ల ఎత్తు, వాయవ్యం కంటే నైరుతి రెండు యూనిట్ల ఎత్తు పెరిగి వుండాలి. ఈ ఎత్తులు సరిగ్గా 1, 2, 3 యూనిట్ల తేడాతోనే వుండాలన్న నియమం లేదు. కానీ ఆయా దిక్కుల్లో ఆ విధంగా మాత్రం నేల ఎత్తులు తప్పకుండా పెరిగి వుండేలా చూసుకోవాలి. ఇలా చేయడం వల్ల ఇల్లు కడిగిన నీరు ఈశాన్యం వైపు పారి అటు నుండి బయటకు వెళ్లిపోతుంది. ఇంట్లోనే కాక మొత్తం ప్లాటును చదును చేసేటప్పుడు కూడా ఈ నియమాలను అనుసరించి ఎత్తుపల్లాలను సరిచేస్తే వర్షంనీరు ఈశాన్యానికి పారి అటు నుండి బయటకు వెళ్లడం వల్ల సర్వ శుభాలు కలుగుతాయి.

# పదరంగం-21

**కూర్పు: పోపూరి విశ్వనాథ్**



## ఆధారాలు

### అడ్డం

1. చట్టాలను, నిబంధనలను ఆచరణ/కార్యరూపంలోకి తేవడం (3)
4. పుస్తకం/పత్రిక మొదలైనవాటి ముద్రణ (4)
6. అతిగా మాట్లాడుతుంటే ఇలా అంటారు (5)
8. అటునించిపడ్డ నిందలు (2)
10. అంకురం (3)
12. అసలు కాదు, ఒకదాని ప్రతి (3)
14. ఒక శృంగార నాయిక (4)
16. ఒక తెలుగు సంవత్సరం (4)
10. అపసవ్యంగా వచ్చిన ఋణం (2)
21. నిప్పు పుట్టించే రాయి (6)
23. ఒకప్పుడు నిరుపేదల నివాసం (3)
24. తెలంగాణా మాండలికంలో వడ్డీ (2)
25. పత్రికా భాషలో చనిపోయిన గొప్పవారు (5)

### నిలువు

1. కష్టాలు (4)
2. పైకొచ్చిన ప్రశ్న (3)
3. ఆసుపత్రి/జైలు నుంచి బయటకు రావడం (4)
4. ఏదైనా పనిని చేయ మొదలు పెట్టడం (3)
5. అనురాగం, రసకందాయం (2)
7. అవకాశం (2)
9. తలకిందులైన ప్రసిద్ధి (3)
11. కొయ్య, దారు (3)
13. తెలిసిరావడం లాంటిది (4)
15. చాకచక్యంగా ఆహారాన్ని వేటాడే ఒక పక్షి (4)
17. ఇరవై దస్తాలు (2)
18. అవమానం (4)
20. సాధారణంగా సంక్రాంతికి చేసే పిండివంట (4)
21. స్నేహం (3)
22. భయం, అధైర్యం (3)

## పదరంగం-19కి జవాబులు పంపించినవారు

1. జి.సుబ్రహ్మణ్యం-రాజంపేట; 2. యం.వి.రమణకుమారి, వుమ్మా రంగారెడ్డి-హైదరాబాద్; 3. అశోక్.వి-సికిందరాబాద్.

జవాబులు పంపించాల్సిన చిరునామా:

**పదరంగం** ఆదివారం వార్త, నం.396,

లోయర్ ట్యాంక్‌బండ్, హైదరాబాద్-500 080.


పేరు : ..............................................


..............................................


ఊరు : ..............................................

## పదరంగం-19 జవాబులు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| ఇ1 | ల్ల | రి2 | కం | | అ3 | ప4 | వా | దు5 | |
| బ్బ | | స | | త్న6 | | రి | | త్త7 | అ8 |
| డి9 | బ | రా | | ర10 | క్ష | ణ | | | ను |
| ము | | స11 | భ్య | త | | తి12 | లో13 | త్త | మ |
| బ్బ14 | బొ | | | ర | | | భి | | తి |
| డి | | మ15 | పు16 | భా | ర17 | తం | | తీ18 | |
| | ఆ19 | | హ | | క్త | | స20 | రం | గు21 |
| అ22 | మె | రి | కా | | సం23 | స్కా | రం | | ణం |
| త్త | | | రా24 | దు | బం | | జా25 | మీ | ను |
| రు26 | ప | వు | లు | | ధం | | మా | | అ |


దీనికి అమీర్‌పేట్ లో కోడిపందాల
కోచింగ్ ఇప్పించా బావా!!
Zakir


నుష్టిస్తే.. 'ఆడదే ముగ్గయాలా' అంటారు.. నేకేస్తే
'తేడా'గాడు అంటారు.. అందుకే ఔట్‌సోర్సింగ్ కు ఇద్దాం ఈసారి!!
Zakir...



ఓడిపోయిన పుంజునే చూడండి డాడ్..
చెప్పినట్లు పడి ఉంటాడు!!
Zakir...

ఈ వారం కా'ర్టూ న్స్'

# ఫోటో ఫీచర్







పుణెకు
సమీపంలో వున్న
ముల్షీలోయలోని కొండలపై వున్న
లావాసా  నగరానికి సంబంధించిన
చిత్రాలివి. ఇటలీలోని పోర్టిఫినో గ్రామాన్ని
తలపించేలా దీనిని నిర్మించారు. పర్యాటక
ప్రాంతంగా మారిన ఈ నగరం డెస్టినేషన్
పెళ్లిళ్లకు, ఫొటో షూట్‌లకు పేరు
గడిస్తోంది.



